Telugu Daily

వేములవాడ వార్త

మీకోసం మా అక్షరం

కరీంనగర్
సంపుటి 09
సంచిక: 56
ఆదివారం
29 నవంబర్
2026
పేజీలు: 08

Karimnagar, Hyderabad, Rangareddy, Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad www.vemulawadavaartha.in



850 స్థానాలతో ప్రజాస్వామ్యానికి ముప్పు

- కులగణన తర్వాతే డీలిమిటేషన్ చేపట్టాలి
- కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ

5





150ఏళ్ల తర్వాత..

తమిళనాడులోని మధురై సమీప తిరుప్పరన్‌కుండ్రం కొండపై కార్తీక దీపం వెలిగింది. దాదాపు 150 ఏళ్ల తర్వాత తొలిసారిగా శనివారం సాయంత్రం 5 గంటలకు కొండపై ఉన్న రాతి దీపస్తంభం (దీపత్తూన్) వద్ద జ్యోతిని ప్రజ్వలించారు. సుప్రీంకోర్టు నియమించిన మాజీ న్యాయమూర్తుల సమక్షంలో, కట్టుదిట్టమైన సీఆర్‌పీఎఫ్ భద్రత నడుమ ఈ కార్యక్రమం నిర్వహించారు. దశాబ్దాలుగా దీపస్తంభం వద్ద దీపం వెలిగించే హక్కు కోసం పోరాడుతున్న భక్తులు, హిందూ సంఘాల ప్రతినిధుల ఆకాంక్ష నెరవేరడంతో కొండ పరిసరాలు 'వెట్రివేల్.. వీరవేల్' నినాదాలతో మార్మోగాయి. పలువురు భక్తులు భావోద్వేగానికి గురై కన్నీళ్లు పెట్టుకోగా, మరికొందరు పూలు చల్లి ఆనందం వ్యక్తం చేశారు. దీపం వెలిగించేందుకు ప్రత్యేకంగా మట్టి ప్రమిదను సిద్ధం చేశారు. అందులో సుమారు 50 మీటర్ల పొడవైన పత్తి వత్తిని ఉంచి, 30 కిలోల నెయ్యి, ఐదు కిలోల కర్పూరాన్ని వినియోగించారు. నిర్ణీత సమయానికి జ్యోతిని వెలిగించారు. సమీపంలోని ఫ్లైఓవర్, భవనాల పైకప్పులు, మేడలపై వేలాది మంది భక్తులు ఈ దృశ్యాన్ని వీక్షించారు. శంఖాలు పూరిస్తూ, సంప్రదాయ వాయిద్యాలు మోగిస్తూ సంతోషం వ్యక్తం చేశారు. స్థానికులు బాణసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు.

డీలిమిటేషన్‌పై సమరానికి రేవంత్

- ఇండియా కూటమి వాదన వినిపించేందుకు ఢిల్లీకి వెళ్లిన ముఖ్యమంత్రి
- కాంగ్రెస్ పాలిత నాలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులతో ఉమ్మడి మీడియా సమావేశం
- పార్లమెంట్‌లో అనుసరించాల్సిన వ్యూహంపై ఎంపీలకు దిశానిర్దేశం

హైదరాబాద్, వీవీన్యూస్: నియోజకవర్గాల పునర్విభజన బిల్లును వ్యతిరేకిస్తున్న ఇండియా కూటమి తరపున గళం వినిపించేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శనివారం రాత్రి ఢిల్లీ బయలుదేరి వెళ్లారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు కర్ణాటక, కేరళ, హిమాచల్‌ప్రదేశ్ సీఎంలతో కలిసి ఆదివారం మధ్యాహ్నం 12 గంటలకు ఢిల్లీలో మీడియా సమావేశం నిర్వహించనున్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న డీలిమిటేషన్ బిల్లుపై కాంగ్రెస్ కూటమి వైఖరిని బలంగా వినిపించాలని అఖిల భారత కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ) ఈ నలుగురు ముఖ్యమంత్రులకు సూచించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. డీలిమిటేషన్ బిల్లు అమల్లోకి వస్తే రాష్ట్రాలకు, ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాలకు ఎదురయ్యే పరిణామాలు, జరిగే నష్టాలను ఈ సమావేశంలో ముఖ్యమంత్రులు వివరించనున్నట్లు తెలుస్తోంది. బిల్లును వ్యతిరేకిస్తూ ఇండియా కూటమి తరపున తమ వాదనలను ప్రజల ముందుకు తీసుకెళ్లడమే ఈ భేటీ ప్రధాన ఉద్దేశంగా పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి.



ఎంపీలకు సీఎం దిశానిర్దేశం

పార్లమెంట్‌లో డీలిమిటేషన్ బిల్లుపై అనుసరించాల్సిన వ్యూహంపైనా రేవంత్‌రెడ్డి రాష్ట్ర కాంగ్రెస్ ఎంపీలతో చర్చించనున్నారు. ఈ అంశంపై పార్టీ వైఖరిని సమర్థంగా వినిపించడంతో పాటు సభలో అనుసరించాల్సిన విధానంపై వారికి దిశానిర్దేశం చేయనున్నారు. కాంగ్రెస్ పార్టీ ఎంపీలకు విప్ జారీ చేసిన నేపథ్యంలో ఆదివారం ఉదయం 10 గంటలకల్లా దిల్లీ చేరుకోవాలని రాష్ట్రానికి చెందిన పార్టీ ఎంపీలకు సీఎం సూచించినట్లు సమాచారం.

మహిళా రిజర్వేషన్ల అమలును
ఎవరూ ఆపలేరు
వారికి ఇచ్చిన మాట నిలబెట్టుకుంటాం

- 33 శాతం కోటా కల్పించి తీరుతాం
- అడ్డంకులన్నింటినీ తొలగిస్తాం
- విపక్షాల వ్యతిరేకతతో ఆగదు
- ప్రధాని నరేంద్ర మోదీ

న్యూఢిల్లీ: లోక్‌సభ, రాష్ట్రాల శాసనసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించే విషయంలో వెనక్కి తగ్గేది లేదని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. మహిళా రిజర్వేషన్ల అమలుకు ఎదురయ్యే ప్రతి అడ్డంకినీ తొలగిస్తామని, ఈ విషయంలో ప్రభుత్వ సంకల్పం దృఢంగా ఉందని ప్రకటించారు. ఈ ప్రతిపాదనను వ్యతిరేకించే రాజకీయ పార్టీలు కూడా మహిళల ప్రాతినిధ్యం పెరగకుండా అడ్డుకోలేవని అన్నారు. పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల నేపథ్యంలో శనివారం ఎక్స్ వేదికగా విడుదల చేసిన వీడియో సందేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. దేశంలోని మహిళా శక్తికి ఇచ్చిన హామీని తప్పకుండా నెరవేరుస్తామని మోదీ తెలిపారు. మహిళా రిజర్వేషన్ల అమలుకు ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని భరోసా ఇచ్చారు. ఈ బిల్లుకు మద్దతు ఇస్తున్న వారి ఆత్మవిశ్వాసం, ధైర్యం చెక్కుచెదరలేదని పేర్కొన్నారు. చట్టసభల్లో మహిళలకు తగిన ప్రాతినిధ్యం కల్పించాలన్న పోరాటం దశాబ్దాలుగా కొనసాగుతోందని, ఆ లక్ష్యాన్ని సాధించేందుకు తానూ ప్రయత్నిస్తున్న వారిలో ఒకరినని చెప్పారు. ఈ అంశంపై పలువురు మహిళలు తనతో మాట్లాడారని, దేశంలోని మహిళలందరి ఆశీస్సులు తమకు ఉన్నాయని పేర్కొన్నారు. మహిళలకు చట్టసభల్లో మూడో వంతు రిజర్వేషన్లు కల్పించేందుకు కేంద్రం సోమవారం లోక్‌సభలో 132వ రాజ్యాంగ సవరణ బిల్లు–2026 ను ప్రవేశపెట్టనుంది. ఇందులో భాగంగా లోక్‌సభ గరిష్ఠ సభ్యుల సంఖ్యను 850కి పెంచాలని ప్రతిపాదించారు. ఇందులో రాష్ట్రాల నుంచి 815 మంది, కేంద్రపాలిత ప్రాంతాల నుంచి 35 మంది సభ్యులుగా ఉండనున్నారు. రాష్ట్రాల శాసనసభల్లో గరిష్ఠ స్థానాల సంఖ్యను కూడా 500 నుంచి 650కి పెంచాలని బిల్లులో పేర్కొన్నారు.



దక్షిణాది రాష్ట్రాల ఆందోళనలకు పరిష్కారం

గత ఏప్రిల్‌లో డీలిమిటేషన్‌తో ముడిపడిన మహిళా రిజర్వేషన్ల అమలు ప్రతిపాదనను విపక్షాలు వ్యతిరేకించడంతో కేంద్రం వెనక్కి తగ్గాల్సి వచ్చింది. తాజాగా ప్రతి రాష్ట్రం, కేంద్రపాలిత ప్రాంతానికి కేటాయించే స్థానాలను ఏకరీతిలో 50 శాతం పెంచాలని కొత్త బిల్లులో ప్రతిపాదించారు. పెరిగిన స్థానాల కేటాయింపులు, నియోజకవర్గాల సరిహద్దులను 2051 వరకు మార్చకుండా ఉండాలని నిర్ణయించారు. దీనివల్ల లోక్‌సభలో తమ ప్రాతినిధ్య వాటా తగ్గుతుందన్న దక్షిణాది రాష్ట్రాల ఆందోళనలకు పరిష్కారం చూపాలని కేంద్రం భావిస్తోంది.

విపక్షాల మద్దతుపై కేంద్రం ధీమా

గతంలో బిల్లును వ్యతిరేకించిన తృణమూల్ కాంగ్రెస్, శివసేన (యూబీటీ)లో అంతర్గత విభేదాలు ఉండటంతో ఈసారి పరిస్థితులు తమకు అనుకూలిస్తాయని కేంద్రం అంచనా వేస్తోంది. డీఎంకే, ఎన్సీపీ (శరద్‌చంద్ర పవార్) మద్దతు కోసం కూడా ప్రయత్నిస్తోంది. లోక్‌సభలో తమిళనాడుకు ప్రస్తుతం ఉన్న 7.18 శాతం ప్రాతినిధ్య వాటాకు ఎలాంటి నష్టం జరగదని డీఎంకేకు హామీ ఇచ్చినట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. 50 శాతం సీట్ల పెంపునకు హామీ ఇస్తే బిల్లుకు మద్దతు ఇస్తామని ఎన్సీపీ (శరద్‌చంద్ర పవార్) ఇప్పటికే ప్రకటించింది.



దీక్షా దివస్‌కు అలుగునూరు సిద్ధం

- కేసీఆర్ నిరాహార దీక్షకు బయల్దేరిన చారిత్రక ఘట్టానికి 17ఏళ్లు
- నేడు అలుగునూర్‌లో బీఆర్ఎస్ భారీ బహిరంగ సభ
- మధ్యాహ్నం 3 గంటలకు కార్యక్రమం.. ముఖ్య అతిథిగా రానున్న కేటీఆర్



డీలిమిటేషన్ బిల్లుకు బీఆర్ఎస్ మద్దతు



డీఎంకే డిమాండ్లకు బిల్లులో చోటు

- అందుకే మద్దతిస్తున్నాం
- డీలిమిటేషన్‌పై వైఖరి మార్చుకోలేదు
- తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి స్టాలిన్



చెన్నై: డీలిమిటేషన్ బిల్లులో తమ పార్టీ లేవనెత్తిన రెండు ప్రధాన డిమాండ్లకు చోటు కల్పించినందునే మద్దతు ఇవ్వాలని నిర్ణయించినట్లు డీఎంకే అధ్యక్షుడు, తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ వెల్లడించారు. ఇది డీఎంకే పోరాటానికి దక్కిన విజయమని, తమిళనాడుతోపాటు దక్షిణాది రాష్ట్రాలన్నింటికీ లభించిన విజయమని పేర్కొన్నారు. లోక్‌సభలో తమిళనాడుకు ప్రస్తుతం ఉన్న 7.18 శాతం సీట్ల వాటాను తగ్గించకూడదన్నది తమ మొదటి డిమాండ్ కాగా, రాష్ట్రాల మధ్య పార్లమెంటరీ ప్రాతినిధ్యం 1971 జనాభా లెక్కల ఆధారంగా ఉన్న నిష్పత్తిలోనే కొనసాగించాలన్నది రెండో డిమాండ్ అని వివరించారు. ఈ రెండు డిమాండ్లను తాజా బిల్లులో స్పష్టంగా పొందుపరిచారని స్టాలిన్ తెలిపారు. గత ఏప్రిల్‌లో పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బిల్లులో ఈ అంశాలు లేకపోవడంతోనే తాము వ్యతిరేకించామని గుర్తుచేశారు. 1971 జనాభా లెక్కల ప్రాతిపదికన అన్ని రాష్ట్రాల్లో నియోజకవర్గాల సంఖ్యను 50 శాతం పెంచే అవకాశం కల్పిస్తున్న తాజా బిల్లును కోల్పోతే జరిగే పరిణామాలపై భావోద్వేగాలకు లోనుకాకుండా ప్రశాంతంగా ఆలోచించాలని సూచించారు. అన్ని అంశాలను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే తమ పార్టీ ఎంపీల సమావేశంలో ఈ రూపంలోని డీలిమిటేషన్‌కు మద్దతు ఇవ్వాలని నిర్ణయించినట్లు చెప్పారు.

న్యాయమైన పునర్విభజనకే మద్దతు

డీలిమిటేషన్‌కు డీఎంకే ఎప్పుడూ వ్యతిరేకం కాదని, రాష్ట్రాలకు దక్కాల్సిన ప్రాతినిధ్యాన్ని దెబ్బతీసే పునర్విభజనను మాత్రమే వ్యతిరేకిస్తోందని స్టాలిన్ స్పష్టం చేశారు. 2024 నుంచి తమ పార్టీ సాగిస్తున్న పోరాటానికి తాజా పరిణామం ఫలితమని పేర్కొన్నారు. డీఎంకే సీనియర్ నేత ఏ.రాజా మాట్లాడుతూ.. తమ డిమాండ్లను బిల్లులో చేర్చినందువల్లే మద్దతు ప్రకటించామని తెలిపారు. తమిళనాడుకు ఎలాంటి నష్టం జరగదని, లోక్‌సభలో ప్రస్తుతం ఉన్న 7.18 శాతం వాటా 7.21 శాతానికి పెరుగుతుందని వివరించారు. రాష్ట్రాల మధ్య ప్రాతినిధ్య నిష్పత్తి 1971 జనాభా లెక్కల ఆధారంగానే కొనసాగుతుందన్నారు. అధికారంలో ఉన్నా, లేకున్నా తమ పార్టీ వైఖరిలో మార్పు లేదని పేర్కొన్నారు.

డీలిమిటేషన్‌ను ఉమ్మడిగా వ్యతిరేకిస్తాం

- ఎస్సీ, ఎస్టీలకు అన్యాయం.. ప్రజాస్వామ్యానికి ముప్పు
- అధికారాన్ని శాశ్వతంగా చేజిక్కించుకునేందుకే బీజేపీ, ఆరెస్సెస్ కుట్ర
- లోక్‌సభ స్థానాల ప్రస్తుత సంఖ్యను కొనసాగించాలి
- మహిళా రిజర్వేషన్లు ఇప్పుడున్న స్థానాల ఆధారంగానే అమలు చేయాలి: ఖర్గే

న్యూఢిల్లీ: లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్), మహిళా రిజర్వేషన్ల అమలుకు ఉద్దేశించిన రాజ్యాంగ సవరణ బిల్లును పార్లమెంటులో ఉమ్మడిగా వ్యతిరేకించాలని ఇండియా కూటమి నేతలు నిర్ణయించారు. ఈ బిల్లు వల్ల ఎస్సీ, ఎస్టీలకు అన్యాయం జరుగుతుందని, దేశంలో ప్రజాస్వామ్యాన్ని అంతం చేసి అధికారాన్ని శాశ్వతంగా చేజిక్కించుకోవాలన్నది బీజేపీ, ఆరెస్సెస్ లక్ష్యమని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆరోపించారు. శనివారం రాజ్యసభలో ప్రతిపక్ష నేత నివాసంలో జరిగిన ఇండియా కూటమి పార్టీల నేతల సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు.

'400 పార్' నుంచి '800 పార్'కు..

గత లోక్‌సభ ఎన్నికల సమయంలో ప్రధాని మోదీ '400 పార్' నినాదం ఇచ్చారని, ఇప్పుడు ఈ బిల్లుతో లోక్‌సభ స్థానాల సంఖ్యను 850కి పెంచి '800 పార్' లక్ష్యంగా ముందుకెళ్తున్నారని ఖర్గే విమర్శించారు. అధికారాన్ని శాశ్వతంగా తమ చేతుల్లోనే ఉంచుకోవడానికి ఈ బిల్లును ఆయుధంగా ఉపయోగించుకోవాలని చూస్తున్నారని ఆరోపించారు. దేశంలో ప్రజాస్వామ్యాన్ని అంతం చేసి బీజేపీ, ఆరెస్సెస్ చేతుల్లోనే పాలన ఉండేలా కుట్ర చేస్తున్నారని అన్నారు. చివరకు మనుస్మృతిని అమలు చేయాలన్నదే వారి ఉద్దేశమని వ్యాఖ్యానించారు. దేశంలో ఎస్సీ, ఎస్టీల జనాభా పెరిగిందని, తాజా జనగణనలో ఈ విషయం వెల్లడవుతుందని ఖర్గే అన్నారు. అయితే జనాభా ప్రాతిపదికన వారికి లోక్‌సభలో పెరగాల్సిన ప్రాతినిధ్యం దక్కకుండా చేసేందుకే ఈ బిల్లు తీసుకొస్తున్నారని ఆరోపించారు. గతంలోనూ ఈ బిల్లును ఆమోదింపజేసుకునేందుకు బీజేపీ ప్రయత్నించిందని, ప్రతిపక్షాల ఐక్య పోరాటంతో అది సాధ్యం కాలేదని గుర్తుచేశారు. వేలాది మంది చేతులు ఎత్తి మెజారిటీ సాధించే చైనా తరహా పరిస్థితులను భారత్‌లోనూ తీసుకురావాలని చూస్తున్నారని ఖర్గే విమర్శించారు. టీఎంసీ, శివసేన తదితర పార్టీలను చీల్చడం కూడా అధికారాన్ని శాశ్వతంగా నిలుపుకోవడంలో భాగమేనని ఆరోపించారు. లోక్‌సభ స్థానాలు 850కి పెరిగితే దేశానికి తీవ్ర నష్టం జరుగుతుందని, ప్రజాస్వామ్య వ్యవస్థ బలహీనపడుతుందని అన్నారు. ఇదిలా ఉంటే డీలిమిటేషన్‌పై జరిగిన సమావేశంలో ప్రతిపక్ష నేతలు మూడు కీలక డిమాండ్లను ముందుకు తెచ్చారు. లోక్‌సభ ప్రస్తుత సభ్యుల సంఖ్యను కొనసాగించాలని, ఇప్పుడున్న స్థానాల ఆధారంగానే మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని, రాష్ట్రాల మధ్య ప్రస్తుతం ఉన్న లోక్‌సభ స్థానాల కేటాయింపును మరో 25 ఏళ్లపాటు కొనసాగించాలని నిర్ణయించారు.

ఎన్నికల సంఘం తీరుపైనా విమర్శలు

డీలిమిటేషన్ ప్రక్రియ బాధ్యతలను వివాదాస్పద ప్రధాన ఎన్నికల కమిషనర్‌కు అప్పగించాలని ప్రభుత్వం చూస్తోందని ఖర్గే ఆరోపించారు. ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో ఓట్ల చోరీ ఆరోపణలతో ఇప్పటికే ఆయన పాత్రపై ప్రశ్నలు తలెత్తుతున్నాయని అన్నారు. డీలిమిటేషన్‌లోనూ అక్రమాలకు అవకాశం ఉంటుందని ఆరోపించారు. బీజేపీకి అనుకూలంగా ఒక నియోజకవర్గాన్ని ఎస్సీ, ఎస్టీ రిజర్వుడు స్థానంగా మార్చడం లేదా రిజర్వుడు స్థానాన్ని సాధారణ స్థానంగా మార్చడం వంటి నిర్ణయాలు తీసుకునే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. ఖర్గే అధ్యక్షతన జరిగిన సమావేశంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ, టీఎంసీ నేత అభిషేక్ బెనర్జీ, స్వతంత్ర ఎంపీ కపిల్ సిబల్, ఆర్జేడీ నేతలు అభయ్‌కుమార్ సింగ్, మనోజ్ ఝా, సీపీఐ నేత పి.సంతోష్‌కుమార్, ఐయూఎంఎల్ నేత ఈటీ మహమ్మద్ బషీర్, ఆర్ఎస్‌పీ నేత ఎన్‌కే ప్రేమచంద్రన్ తదితరులు పాల్గొన్నారు. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శులు ప్రియాంకాగాంధీ వాద్రా, జైరాం రమేశ్, కేసీ వేణుగోపాల్ కూడా హాజరయ్యారు. ఎన్సీపీ (ఎస్పీ) తరఫున సుప్రియా సూలే తన తండ్రి ఆరోగ్యం బాగోలేకపోవడంతో సమావేశానికి రాలేకపోయారు. డీఎంకే, ఆమ్, బీజేడీలకు ఆహ్వానం పంపినప్పటికీ ఆ పార్టీల నేతలు హాజరుకాలేదు.

డీలిమిటేషన్‌పై ఒత్తిళ్లకు తలొగ్గేది లేదు


ముంబై: నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) బిల్లుపై ఎలాంటి ఒత్తిళ్లకూ తలొగ్గేది లేదని శివసేన (యూబీటీ) నేత, మహారాష్ట్ర మాజీ మంత్రి ఆదిత్య ఠాక్రే స్పష్టం చేశారు. ఈ ప్రక్రియ ద్వారా మహారాష్ట్ర అస్తిత్వాన్ని చెరిపేసే ప్రయత్నం జరుగుతోందని, రాష్ట్ర గొంతుకను అణచివేస్తున్నారని ఆరోపించారు. శనివారం ముంబయిలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. డీలిమిటేషన్‌తో రాష్ట్రాల లోక్‌సభ స్థానాలు 50 శాతం పెరుగుతాయని చెబుతున్నారని ఆదిత్య ఠాక్రే పేర్కొన్నారు. అయితే ఉత్తరప్రదేశ్‌లో స్థానాలు 120 పెరిగితే.. మహారాష్ట్రతో ఆ రాష్ట్రానికి మధ్య ప్రస్తుతం ఉన్న 32 లేదా 39 స్థానాల వ్యత్యాసం మరింత పెరుగుతుందని వివరించారు. తమిళనాడుతో పోలిస్తే యూపీ స్థానాల మధ్య తేడా 60కు చేరుతుందని చెప్పారు. ఈ పరిణామాలు రాష్ట్రాల ప్రాతినిధ్యంలో అసమతుల్యతకు దారితీస్తాయని ఆందోళన వ్యక్తం చేశారు.

ప్రతిపక్ష కూటమిలో భిన్నాభిప్రాయాలు

బిల్లుకు పార్లమెంటులో అవసరమైన మద్దతు కూడగట్టేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. డీఎంకే, ఎన్సీపీ (ఎస్పీ), వైఎస్సార్ కాంగ్రెస్ మద్దతు లభిస్తే బిల్లుకు అనుకూలంగా 353 ఓట్లు వచ్చే అవకాశం ఉందని అంచనాలు వెలువడ్డాయి. శివసేన (యూబీటీ) మిత్రపక్షమైన ఎన్సీపీ (ఎస్పీ) బిల్లుకు మద్దతు ఇవ్వాలని నిర్ణయించినట్లు వార్తలు వచ్చినప్పటికీ.. ముసాయిదాను పరిశీలించిన తర్వాతే తమ వైఖరిని వెల్లడిస్తామని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ సుప్రియా సూలే శుక్రవారం తెలిపారు. మరోవైపు, బిల్లును ఎన్సీపీ (ఎస్పీ) వ్యతిరేకించాలని ఆశిస్తున్నట్లు మహారాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు హర్షవర్ధన్ సప్కాల్ పేర్కొన్నారు. మహా వికాస్ అఘాడీ (ఎంవీఏ)లో శివసేన (యూబీటీ), ఎన్సీపీ (ఎస్పీ), కాంగ్రెస్ భాగస్వాములుగా ఉన్నాయి.



పీవోకేలోనూ నియోజకవర్గాల పునర్విభజన



- పాక్ ఆక్రమణ ముగిశాక ప్రక్రియ
- చేపట్టేలా బిల్లులో నిబంధన
- 24 అసెంబ్లీ స్థానాలపై మాత్రం స్పష్టత కరవు

న్యూఢిల్లీ: పాకిస్థాన్ ఆక్రమణలో ఉన్న జమ్మూకశ్మీర్ ప్రాంతంలోనూ భవిష్యత్తులో నియోజకవర్గాల పునర్విభజన చేపట్టేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. ఆ ప్రాంతంపై పాక్ ఆక్రమణ తొలగిన తర్వాత అక్కడి అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజన బాధ్యతను భారత ఎన్నికల సంఘం చేపట్టేలా డీలిమిటేషన్ (రెండో సవరణ) బిల్లు–2026లో నిబంధన చేర్చింది. బిల్లులోని సెక్షన్ 3(4)లో ఈ మేరకు ప్రత్యేకంగా పేర్కొన్నారు. అయితే పాక్ ఆక్రమణ ముగిసిన తర్వాతే ఈ నిబంధన అమల్లోకి వస్తుందని స్పష్టం చేశారు. సాధారణంగా నియోజకవర్గాల పునర్విభజన కోసం సుప్రీంకోర్టు ప్రస్తుత లేదా మాజీ న్యాయమూర్తి అధ్యక్షతన ప్రత్యేక కమిషన్‌ను ఏర్పాటు చేయాలని బిల్లులో ప్రతిపాదించారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ లేదా మరో ఎన్నికల కమిషనర్, రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ఇందులో సభ్యులుగా ఉంటారు. అయితే పాక్ ఆక్రమణలో ఉన్న జమ్మూకశ్మీర్ ప్రాంతానికి సంబంధించి భారత ఎన్నికల సంఘమే డీలిమిటేషన్ కమిషన్‌గా వ్యవహరించనుంది. బిల్లులో ఈ ప్రాంతాన్ని 'పాకిస్థాన్ ఆక్రమణలో ఉన్న ప్రాంతం'గా పేర్కొన్నారే తప్ప, 'పీవోకే' అనే పదాన్ని ఉపయోగించలేదు. ఈ నిబంధన జమ్మూకశ్మీర్ అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజనకే పరిమితమైంది. ఆ ప్రాంతానికి సంబంధించిన లోక్‌సభ స్థానాల గురించి బిల్లులో ఎలాంటి ప్రస్తావన లేదు. ఇప్పటికే రిజర్వు చేసిన 24 అసెంబ్లీ స్థానాల విషయంలోనూ స్పష్టత ఇవ్వలేదు. దేశవ్యాప్తంగా ప్రతిపాదించిన 50 శాతం సీట్ల పెంపు ఈ ప్రాంతానికీ వర్తిస్తుందా? లేదా? అన్నది కూడా వెల్లడించలేదు. మూడు కేంద్రపాలిత ప్రాంతాల చట్టాలకు సవరణలు మహిళా రిజర్వేషన్ల అమలుకు ఉద్దేశించిన 132వ రాజ్యాంగ సవరణకు అనుగుణంగా ఢిల్లీ, జమ్మూకశ్మీర్, పుదుచ్చేరి చట్టాలను సవరించేందుకు కేంద్రం మరో బిల్లును తీసుకొస్తోంది. కేంద్రపాలిత ప్రాంతాల చట్టాల (రెండో సవరణ) బిల్లు–2026 పేరుతో దీనిని ప్రవేశపెట్టనుంది. శాసనసభలు ఉన్న ఈ మూడు కేంద్రపాలిత ప్రాంతాల్లో నియోజకవర్గాల పునర్విభజన తర్వాత 50 శాతం సీట్ల పెంపుతో మహిళలకు రిజర్వేషన్లు అమలు చేయాలన్నది ప్రతిపాదన. మహిళా రిజర్వేషన్లను 2029 నుంచి అమలు చేయాలనే లక్ష్యంతో 131వ రాజ్యాంగ సవరణ బిల్లుతోపాటు డీలిమిటేషన్, కేంద్రపాలిత ప్రాంతాల చట్టాల సవరణ బిల్లులను కేంద్రం గత ఏప్రిల్‌లోనే లోక్‌సభలో ప్రవేశపెట్టింది. అయితే రాజ్యాంగ సవరణ బిల్లుకు అవసరమైన సంఖ్యాబలం లేకపోవడంతో అది ఆమోదం పొందలేదు. దీంతో మిగిలిన రెండు బిల్లులపై ఓటింగ్ జరగలేదు. ఈ నేపథ్యంలో గతంలో ప్రవేశపెట్టిన ఆ రెండు బిల్లులను ఉపసంహరించుకుని, వాటి స్థానంలో కొత్త బిల్లులను తీసుకురావాలని కేంద్రం నిర్ణయించింది. సోమవారం కొత్త రాజ్యాంగ సవరణ బిల్లుతోపాటు ఈ రెండు బిల్లులను కూడా పార్లమెంటులో ప్రవేశపెట్టనుంది.



ప్రధాని పదవిని రాహుల్ జన్మహక్కుగా భావిస్తున్నారు

- ఆశ నెరవేరకపోవడంతో ప్రజాస్వామ్యంలో గందరగోళం సృష్టించే యత్నం
- పార్లమెంటులో చర్చలకు రాకుండా మోదీకి సవాల్ చేయడమేంటి?
- కాంగ్రెస్ హయాంలో సోనియా రిమోట్ పాలన
- ఎమర్జెన్సీ బాధలు నాకూ తెలుసు
- జమ్మూ సభలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ విమర్శలు

జమ్మూ: కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ ప్రధానమంత్రి పదవిని తన జన్మహక్కుగా భావిస్తున్నారని రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ విమర్శించారు. ఆ పదవిని చేపట్టాలన్న ఆయన ఆకాంక్ష నెరవేరకపోవడంతో.. 'నేను పొందలేకపోతే మరెవరూ పొందకూడదు' అన్న ధోరణితో వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ప్రజాస్వామ్యానికి అత్యున్నత వేదిక అయిన పార్లమెంటులో చర్చల్లో పాల్గొనకుండా, ప్రధాని మోదీతో చర్చకు సవాల్ విసరడం ఏమిటని ప్రశ్నించారు. శనివారం జమ్మూలో బీజేపీ నిర్వహించిన సభలో రాజ్‌నాథ్‌సింగ్ మాట్లాడారు. రాజకీయాల్లో ఉన్నత పదవులను ఆశించడంలో తప్పులేదని, అయితే దేశ అత్యున్నత పదవిని తన జన్మహక్కుగా భావించడం సరికాదని రాజ్‌నాథ్ అన్నారు. రాహుల్ తనను తాను ప్రధాని పదవికి సహజ వారసుడిగా భావిస్తున్నారని విమర్శించారు. 2014 లోక్‌సభ ఎన్నికలకు ముందు, ఆ తర్వాత తన స్నేహితులతో మాట్లాడుతూ.. 2024లో తనకు అవకాశం వస్తుందని రాహుల్ చెప్పినట్లు ఓ జర్నలిస్టు రాసిన కథనాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించారు. అయితే 2024 ఎన్నికలు ముగిసినా నరేంద్ర మోదీయే ప్రధానిగా కొనసాగుతున్నారని వ్యాఖ్యానించారు. ప్రజలు రాహుల్ ఆకాంక్షలను నెరవేర్చకపోవడంతో ప్రజాస్వామ్యంలో గందరగోళం సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. దేశ ప్రజలు రాజకీయంగా చైతన్యవంతులని, ఇలాంటి ప్రయత్నాలను సాగనివ్వరని స్పష్టం చేశారు.

పార్లమెంటులో చర్చలకు రావాలి

ప్రధానితో చర్చకు సవాల్ విసరడానికి ముందు పార్లమెంటులో జరిగే చర్చల్లో పాల్గొనేందుకు రాహుల్ సిద్ధం కావాలని రాజ్‌నాథ్ సూచించారు. ఇతర ఎంపీలతో పోలిస్తే ఆయన హాజరు, చర్చల్లో పాల్గొనే తీరు తక్కువగా ఉన్నాయని ఆరోపించారు. ప్రజా సమస్యలను పార్లమెంటులో ప్రస్తావించాల్సిన ప్రతిపక్ష నేత.. ప్రధాని మోదీపై తప్పుడు ప్రచారం చేయడానికే ప్రాధాన్యమిస్తున్నారని విమర్శించారు. కష్టపడి పనిచేయడం ద్వారా మోదీ ప్రజల విశ్వాసాన్ని పొందారని, భవిష్యత్తులోనూ ఆయనకు ప్రజల ఆదరణ కొనసాగుతుందని అన్నారు.

సైనికులపై వ్యాఖ్యలు బాధాకరం

జాతీయ భద్రతకు సంబంధించి రాహుల్ తప్పుడు ప్రకటనలు చేస్తూ దేశ ప్రతిష్ఠను దెబ్బతీస్తున్నారని రాజ్‌నాథ్ ఆరోపించారు. చైనా సైనికులు భారత జవాన్లను కొట్టారంటూ రాహుల్ చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ.. ఒక దేశ నాయకుడు ఇలాంటి వ్యాఖ్యలు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఈ వ్యాఖ్యలపై సుప్రీంకోర్టు కూడా స్పందిస్తూ, నిజమైన భారతీయులెవరూ ఇలాంటి వ్యాఖ్యలు చేయరని చెప్పినట్లు పేర్కొన్నారు. హిందువులు, శ్రీరాముడిపై రాహుల్ విభజనపూరిత వ్యాఖ్యలు చేస్తున్నారని విమర్శించారు. అయోధ్య రామాలయ ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని రాజకీయ కార్యక్రమంగా అభివర్ణించడాన్ని తప్పుబట్టారు. ప్రభుత్వాన్ని వ్యతిరేకించడం, దేశాన్ని వ్యతిరేకించడం రెండూ వేర్వేరు విషయాలని స్పష్టం చేశారు.

కాంగ్రెస్ ప్రజాస్వామ్య వ్యవస్థలను బలహీనపరిచిందని, గత యూపీఏ ప్రభుత్వాన్ని రిమోట్ కంట్రోల్‌తో నడిపించిందని రాజ్‌నాథ్ ఆరోపించారు. అప్పట్లో సోనియాగాంధీ నేతృత్వంలోని జాతీయ సలహా మండలి (ఎన్ఏసీ) అసలైన అధికార కేంద్రంగా వ్యవహరించిందన్నారు. మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మీడియా సలహాదారు సంజయ్ బారు రాసిన పుస్తకాన్ని ప్రస్తావిస్తూ.. కీలకమైన మంత్రివర్గ ఫైళ్లను ఆమోదం కోసం సోనియాగాంధీకి పంపేవారని పేర్కొన్నారు. 2013లో మన్మోహన్‌సింగ్ ప్రభుత్వం తీసుకొచ్చిన ఓ ఆర్డినెన్స్‌ను రాహుల్ గాంధీ, ప్రధాని విదేశీ పర్యటనలో ఉన్న సమయంలో బహిరంగంగా 'చెత్త'గా అభివర్ణించారని గుర్తుచేశారు. ఆ తర్వాత ప్రభుత్వం తన నిర్ణయాన్ని మార్చుకోవాల్సి వచ్చిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాలు రిమోట్ కంట్రోల్‌తో నడిచినా.. బీజేపీ ప్రభుత్వాన్ని అలా నడిపించే శక్తి ఎవరికీ లేదని వ్యాఖ్యానించారు. మోదీ ప్రభుత్వం తీసుకునే ప్రతి చర్యనూ కొందరు ఎమర్జెన్సీతో పోలుస్తున్నారని రాజ్‌నాథ్ విమర్శించారు. అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న రాజకీయ నేతలపై చట్టపరమైన చర్యలు తీసుకున్నా, ప్రధాని నివాసం ఎదుట గందరగోళం సృష్టించకుండా అడ్డుకున్నా, విధ్వంసానికి ప్రయత్నించే రాజకీయ కార్యకర్తలను నిలువరించినా ఎమర్జెన్సీ అని విమర్శిస్తున్నారని మండిపడ్డారు. అసలు ఎమర్జెన్సీ అంటే ఏమిటో అలాంటి వారికి తెలియదన్నారు. తాను 24 ఏళ్ల వయసులో సుమారు 18 నెలలు జైల్లో గడిపానని, అందులో కొన్ని నెలలు ఏకాంత నిర్బంధంలో ఉన్నానని తెలిపారు. తాను జైల్లో ఉన్న సమయంలోనే తల్లి మరణించినా, అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం పెరోల్ కూడా మంజూరు చేయలేదని గుర్తుచేసుకున్నారు.

కాంగ్రెస్ రాజకీయాలకు కాలం చెల్లింది

కాంగ్రెస్ ప్రతికూల రాజకీయాలకు పాల్పడుతోందని, ప్రజాస్వామ్యాన్ని గుంపుల పాలనగా మార్చేందుకు ప్రయత్నిస్తోందని రాజ్‌నాథ్ ఆరోపించారు. ఆ పార్టీ రాజకీయ గడువు ఎప్పుడో ముగిసిపోయిందని, తిరిగి అధికారంలోకి వచ్చే అవకాశాలు లేవని వ్యాఖ్యానించారు. దేశాభివృద్ధిని అడ్డుకునే ప్రయత్నాలను సహించబోమని తేల్చిచెప్పారు.

అమెరికాలో భూకంపం

- కాలిఫోర్నియాలోని మన్‌హట్టన్ బీచ్ సమీపంలో ప్రకంపనలు

లాస్‌ఏంజెలెస్: అమెరికాలోని కాలిఫోర్నియాలో శనివారం ఉదయం భూకంపం సంభవించింది. మన్‌హట్టన్ బీచ్‌కు నైరుతి దిశగా ఐదు కిలోమీటర్ల దూరంలో భూకంప కేంద్రాన్ని గుర్తించినట్లు అమెరికా భూగర్భ సర్వేక్షణ సంస్థ (యూఎస్‌జీఎస్) తెలిపింది. రిక్టర్ స్కేల్‌పై తీవ్రత 5గా నమోదైంది. ప్రధాన ప్రకంపనల తర్వాత పలుమార్లు భూమి కంపించింది. అయితే ప్రాణ, ఆస్తి నష్టం జరిగినట్లు తక్షణ సమాచారం లేదు. భూకంపం నేపథ్యంలో లాస్‌ఏంజెలెస్ అగ్నిమాపక విభాగం 106 కేంద్రాల సిబ్బందిని రంగంలోకి దించి తనిఖీలు చేపట్టింది. నగరంలో ఎలాంటి నష్టం జరగలేదని అధికారులు వెల్లడించారు. మరిన్ని ప్రకంపనలు వచ్చే అవకాశం ఉందని మన్‌హట్టన్ బీచ్ అధికారులు ప్రజలను అప్రమత్తం చేశారు. ప్రస్తుతం సునామీ ముప్పు లేదని స్పష్టం చేశారు. మిటా ప్రాంతంలో నివసించే 66 ఏళ్ల తెరెసా మాసియాస్ తనకు గంటకుపైగా ప్రకంపనలు అనిపించాయని తెలిపారు.

పాక్‌లో పది నెలల్లో 500 మందికి పైగా ఉగ్రవాదులు హతం

పెషావర్: పాకిస్థాన్‌లోని ఖైబర్ పఖ్తున్‌ఖ్వా ప్రావిన్స్‌లో గత పది నెలల పది రోజుల్లో 500 మందికిపైగా ఉగ్రవాదులు హతమయ్యారు. ఈ మేరకు ఆ రాష్ట్ర ఉగ్రవాద నిరోధక విభాగం (సీటీడీ) శనివారం నివేదిక వెల్లడించింది. ఈ కాలంలో 1,597 ఉగ్రవాద సంబంధిత కేసులు నమోదయ్యాయి. బన్నూ జిల్లాలో అత్యధికంగా 276 కేసులు నమోదై 140 మంది హతమయ్యారు. ఉత్తర వజీరిస్థాన్‌లో 109 మంది, దేరా ఇస్మాయిల్ ఖాన్‌లో 135 మంది, పెషావర్‌లో 40మంది ఉగ్రవాదులు చనిపోయారు. బజౌర్‌లో ఆరుగురు హతమయ్యారు. ఇటీవల ప్రావిన్స్‌లో జరిగిన పది ఉగ్రదాడుల్లో గనుల తవ్వకాలకు ఉపయోగించే పేలుడు పదార్థాలను ఉగ్రవాదులు వినియోగించినట్లు నివేదిక తెలిపింది.

పాఠశాల వద్ద పేలుడు

- ఏడుగురు మృతి
- అఫ్గాన్‌లో దుర్ఘటన

కాబూల్: తూర్పు అఫ్గానిస్థాన్‌లోని కునార్ ప్రావిన్సులో శనివారం ఘోర పేలుడు సంభవించింది. ఓ పాఠశాల వద్ద జరిగిన ఈ ఘటనలో ఏడుగురు ప్రాణాలు కోల్పోగా.. 90 మందికిపైగా గాయపడ్డారు. గనుల తవ్వక సంస్థలకు చెందిన పేలుడు పదార్థాల నిల్వ కేంద్రంలో నిర్లక్ష్యం కారణంగానే ప్రమాదం జరిగినట్లు ప్రాథమికంగా భావిస్తున్నారు. ఈ విషయాన్ని కునార్ ప్రావిన్సు సాంస్కృతిక, సమాచార శాఖ డైరెక్టర్ సామి ఉల్ హక్ బయాన్ వెల్లడించారు. ప్రావిన్సు రాజధాని అసదాబాద్ శివారులోని అండర్ సెర్ ప్రాంతంలో ఉన్న పాఠశాల వద్ద ఉదయం 10 గంటలకు పేలుడు సంభవించినట్లు పోలీసులు తెలిపారు. సమీపంలోని గనుల కంపెనీలకు చెందిన పేలుడు పదార్థాల నిల్వ కేంద్రంలో నిర్లక్ష్యం కారణంగా ఈ ప్రమాదం జరిగినట్లు ప్రాథమిక సమాచారం ఉందని అధికారులు పేర్కొన్నారే తప్ప, దర్యాప్తు కొనసాగుతోందని తెలిపారు.

డా. నర్సయ్యకు కేయూ పీహెచ్‌డీ పట్టా



సిరిసిల్ల, వీవీన్యూస్: సిరిసిల్ల అగ్రహారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల రాజకీయ శాస్త్ర విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డా. జె. నర్సయ్య పీహెచ్‌డీ పట్టా అందుకున్నారు. కాకతీయ విశ్వవిద్యాలయం నిర్వహించిన 24వ స్నాతకోత్సవంలో తెలంగాణ గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లా చేతుల మీదుగా ఆయన ఈ పట్టాను స్వీకరించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ టి. శంకర్, అకడమిక్ కోఆర్డినేటర్ డా. ఎ. ప్రసాద్, డా. ఎస్. కృష్ణ ప్రసాద్, ఫిజికల్ డైరెక్టర్ జి. శ్రీధర్ రావు, ఎం. శకుంతల, డా. కె.వై. కరుణతో పాటు కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది డా. నర్స య్యను అభినందించారు. ఆయన మరిన్ని ఉన్నత విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.



సకాలంలో టీకాలు అందించాలి

సిరిసిల్ల, వీవీన్యూస్: అర్హులైన చిన్నారులందరికీ నిర్దేశిత టీకాలను నిర్ణీత సమయంలో అందించాలని రాజన్న సిరిసిల్ల జిల్లా వైద్య ఆరోగ్య అధికారి (డీఎంహెచ్‌వో) డా.ఏంజెలా ఆల్ఫెడ్ వైద్య, అంగన్‌వాడీ సిబ్బందికి సూచించారు. సిరిసిల్ల పట్టణంలోని సంజీవయ్య నగర్ అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆమె సందర్శించి, అక్కడ నిర్వహిస్తున్న టీకాల కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా చిన్నారులకు అందిస్తున్న టీకాల వివరాలు, కార్యక్రమం అమలు తీరు, రికార్డులను తనిఖీ చేశారు. టీకాలకు అర్హులైన పిల్లలందరికీ సకాలంలో టీకాలు అందేలా వైద్య, అంగన్‌వాడీ సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. చిన్నారుల ఆరోగ్య పరిరక్షణలో టీకాల ప్రాధాన్యాన్ని తల్లిదండ్రులకు వివరించాలని, ప్రతి ఒక్కరూ టీకాల కార్యక్రమంలో భాగస్వాములయ్యేలా అవగాహన కల్పించాలని తెలిపారు. అనంతరం పట్టణంలోని కనకదుర్గ కంటి ఆసుపత్రిని సందర్శించి, అక్కడ అందిస్తున్న కంటి వైద్య సేవలను పరిశీలించారు. రోగులకు అందుతున్న చికిత్స, వైద్య సేవల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని ఆసుపత్రి సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ సంపత్ కుమార్, మహేష్, వీ.సీ.సీ.ఎం. నవీన్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో కొత్తగా ఐదు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు

సిరిసిల్ల, వీవీన్యూస్: రాజన్న సిరిసిల్ల జిల్లాలో కొత్తగా ఐదు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ఏర్పాటుకు జిల్లా సహకార అధికారి టి. రామకృష్ణ శనివారం నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈ సంఘాల ఏర్పాటుపై రైతులు, ప్రస్తుత సహకార సంఘాల సభ్యులు, ప్రజాప్రతినిధుల అభిప్రాయాలు సేకరించనున్నట్లు తెలిపారు. ప్రతిపాదిత కొత్త సంఘాల పరిధిలో వేములవాడ, చెక్కపల్లి, సనుగుల, రుద్రంగి, ఇల్లంతకుంట, పెద్దలింగాపూర్, గంభీరావుపేట, గజసింగవరం, అల్మాస్‌పూర్, తిమ్మాపూర్, వీర్నపల్లి, కోనరావుపేట ప్రాంతాలు ఉన్నట్లు నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. కొత్త సంఘాల ఏర్పాటుపై అభిప్రాయాలు తెలుసుకునేందుకు ఈ నెల 5వ తేదీలోగా ఆయా సహకార సంఘాల్లో ప్రత్యేక మహాజనసభలు నిర్వహించనున్నట్లు రామకృష్ణ వెల్లడించారు. రైతులు, సంఘ సభ్యులు, ప్రజాప్రతినిధులు ఈ సమావేశాల్లో తమ అభిప్రాయాలను తెలియజేయవచ్చన్నారు. కొత్త సంఘాల ఏర్పాటుపై ప్రజలు తమ సూచనలు, అభ్యంతరాలను 18వ తేదీలోగా సంబంధిత సహకార సంఘాల్లో లేదా జిల్లా సహకార అధికారి కార్యాలయంలో సమర్పించాలని కోరారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని ఎస్–16 గదిలో ఉన్న జిల్లా సహకార అధికారి కార్యాలయంలోనూ అభిప్రాయాలు అందజేయవచ్చని తెలిపారు.

ప్రశాంతంగా ముగిసిన నవోదయ పరీక్ష



సిరిసిల్ల, వీవీన్యూస్: రాజన్న సిరిసిల్ల జిల్లాలో జవహర్ నవోదయ విద్యాలయ (ప్రవేశ పరీక్ష –2027) మొత్తం 05 పరీక్షా కేంద్రాలలో ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా ముగిసింది. జిల్లావ్యాప్తంగా ఈ పరీక్షకు మొత్తం 831 మంది విద్యార్థులు నమోదు చేసుకోగా, వారిలో 711 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. 120 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. జిల్లాలో మొత్తం హాజరు శాతం 85.5 శాతంగా నమోదైంది. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖ అధికారి విజయ సాగర్ శనివారం వివిధ పరీక్షా కేంద్రాలను సందర్శించి పరీక్షల నిర్వహణ తీరును పరిశీలించారు. పరీక్షా కేంద్రాలలో విద్యార్థులకు కల్పించిన సౌకర్యాలు, పరీక్షల నిర్వహణ, సిబ్బంది విధులను సమీక్షించారు. పరీక్షలు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా ప్రశాంతంగా, సజావుగా జరిగేలా అధికారులకు తగిన సూచనలు చేశారు. పరీక్షల విజయవంతమైన నిర్వహణకు సహకరించిన పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు, ఇన్విజిలేటర్లు, సంబంధిత అధికారులు మరియు సిబ్బందిని జిల్లా విద్యాశాఖ అధికారి అభినందించారు.



బండ్‌పార్కును ఆహ్లాదకరంగా తీర్చిదిద్దాలి

వేములవాడ, వీవీన్యూస్: పట్టణంలోని బండ్ పార్కును పరిశుభ్రంగా, ఆహ్లాదకరంగా తీర్చిదిద్దాలని మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, వైస్ చైర్మన్ నరాల శేఖర్ అధికారులకు సూచించారు. ఇటీవల షార్ట్ సర్క్యూట్ కారణంగా పార్కులో కొంత గడ్డి కాలిపోయిన నేపథ్యంలో వారు పార్కును సందర్శించి పరిస్థితిని పరిశీలించారు. పార్కులో ఎండిపోయిన గడ్డి, పిచ్చిమొక్కలను వెంటనే తొలగించి పరిసరాలను శుభ్రం చేయాలని ఆదేశించారు. మొక్కలు ఎండిపోకుండా ఎప్పటికప్పుడు నీరు అందిస్తూ వాటిని సంరక్షించాలని సూచించారు. పార్కులో ఉన్న ఇతర సమస్యలను గుర్తించి త్వరితగతిన పరిష్కరించాలని అధికారులకు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సామూహిక కార్తీక దీపోత్సవం



వేములవాడ, వీవీన్యూస్: వేములవాడ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన భీమేశ్వర స్వామి దేవాలయంలో కార్తీక మాస ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. దేవాదాయ శాఖ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న సామూహిక కార్తీక దీపోత్సవంలో భాగంగా 18వ రోజు వేడుకలను ఆలయ ఏఈవో జయకుమారి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. నవంబరు 10 నుంచి డిసెంబరు 8 వరకు జరిగే కార్తీక మాస ఉత్సవాల్లో ప్రతిరోజూ సాయంత్రం 6 నుంచి రాత్రి 8 గంటల వరకు సామూహిక దీపోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. సుహాసినుల ఆధ్వర్యంలో మహిళా భక్తులు భక్తిశ్రద్ధలతో ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నారు.







కొండగట్టు అంజన్నకు వేములవాడ ఆలయం పట్టు వస్త్రాలు

• చందనోత్సవం, మహా సంప్రోక్షణ సందర్భంగా సమర్పణ • కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకున్న వేములవాడ ఈవో రమాదేవి

జగిత్యాల/వేములవాడ, వీవీన్యూస్: జగిత్యాల జిల్లా మల్యాల మండలం ముత్యంపేటలోని కొండగట్టు (శ్రీ ఆంజనేయ స్వామి దేవస్థానానికి వేములవాడ (శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం తరపున శనివారం పట్టు వస్త్రాలు సమర్పించారు. అరుదుగా నిర్వహించే చందనోత్సవం (చందనం తొలగింపు), మహా సంప్రోక్షణ, నిజరూప దర్శనం సందర్భంగా ఈ కార్యక్రమం జరిగింది. దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు ఆదేశాల మేరకు తెలంగాణలోని ప్రముఖ ఆలయాల నుంచి ప్రతి మంగళవారం, శనివారం కొండగట్టు ఆంజనేయ స్వామికి పట్టు వస్త్రాలు సమర్పిస్తున్నారు. ఇందులో భాగంగా వేములవాడ ఆలయ ఈవో ఎల్. రమాదేవి కుటుంబ సభ్యులతో కలిసి కొండగట్టు చేరుకున్నారు. స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం పట్టు వస్త్రాలను సమర్పించారు. దర్శనం అనంతరం కొండగట్టు ఆలయ అర్చకులు, వేద పండితులు వేములవాడ ఈవో రమాదేవికి స్వామివారి శేష వస్త్రం, లడ్డూ ప్రసాదం అందించి ఆశీర్వదించారు. అదేవిధంగా వేములవాడ నుంచి వచ్చిన అర్చకులు, వేద పండితులు కొండగట్టు ఆలయ ఈవో అంజనా రెడ్డికి రాజన్న స్వామివారి శేష వస్త్రం, ప్రసాదాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో వేములవాడ ఆలయ పర్యవేక్షకులు శ్రీనివాస్ శర్మ, ఓన్నారం భాస్కర్, పీఆర్వో పెరుక శ్రీనివాస్, అర్చకులు, వేద పండితులు పాల్గొన్నారు. కొండగట్టు ఆలయం తరపున ఏఈవో హరినాథ్, పర్యవేక్షకుడు సునీల్, సీనియర్ అసిస్టెంట్ అశోక్, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

రైతు సంక్షేమం, వ్యవసాయ అభివృద్ధికి ప్రాధాన్యం

• ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్
• తంగళ్లపల్లి మండలం జిల్లెల్ల వ్యవసాయ కళాశాలలో కిసాన్ మేళా



సిరిసిల్ల, వీవీన్యూస్: రైతుల సంక్షేమం, వ్యవసాయ రంగ అభివృద్ధికి సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నదని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తెలిపారు. తంగళ్లపల్లి మండలం జిల్లెల్ల వద్ద ఉన్న బాబు జగ్జీవన్ రామ్ వ్యవసాయ కళాశాలలో వ్యవసాయ శాఖ, ఆత్మ శాఖ ఆధ్వర్యంలో కిసాన్ మేళా శనివారం నిర్వహించగా, ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితె హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. వివిధ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్స్ ను సందర్శించి, ఉపయోగాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సాగులో నూతన పద్ధతులు పాటిస్తూ .. వరికి బదులుగా కూరగాయలు, పూలు ఇతర సాగు చేస్తూ ఆదాయం పొందుతున్న పలువురు ఆదర్శ రైతులు తమ అనుభవాలు వివరించారు. వారిని సన్మానించి.. వారి సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ.. రైతు పండించిన ప్రతి గింజకు మద్దతు ధర కల్పించడంతో పాటు రైతులకు ఆర్థిక భరోసా కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు గణనీయంగా తగ్గాయని, అందుబాటులో ఉన్న నీటి వనరులను బట్టి పంటల సాగు ప్రణాళిక రూపొందించుకోవాలన్నారు. తాగునీటికి మొదటి ప్రాధాన్యత ఇస్తూనే రైతులకు సాగునీటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు. వరి సాగుతో పాటు ఆయిల్‌పామ్, మిర్చి, కూరగాయలు వంటి వాణిజ్య పంటల సాగుపై రైతులు దృష్టి సారించాలని సూచించారు. ప్రతి గ్రామం నుంచి నలుగురు ఆదర్శ రైతులు ముందుకొచ్చి కొత్త పద్ధతుల్లో సాగు చేపడితే వారిని చూసి మరింత మంది రైతులు ముందుకు వస్తారని అన్నారు. రసాయన ఎరువుల వినియోగాన్ని సాధ్యమైనంత వరకు తగ్గిస్తూ, శాస్త్రవేత్తల సూచనల మేరకు నానో ఎరువులు, సేంద్రియ ఎరువులను వినియోగించాలని కోరారు.

కలెక్టర్ గరిమా అగ్రవాల్ మాట్లాడుతూ.. ఆధునిక వ్యవసాయ పద్ధతులు, నూతన విత్తనాలు, డ్రోన్ టెక్నాలజీ, ఆధునిక యంత్రాలు, బ్యాంక్, పోలీస్ శాఖ, వ్యవసాయ శాఖ, సహకార శాఖ, మత్స్య శాఖ, ఉద్యానవన శాఖల తదితర శాఖల ఆధ్వర్యంలో అందిస్తున్న సేవలు, పథకాలపై అవగాహన కల్పించేందుకు మేళాను ఏర్పాటు చేశామని వెల్లడించారు. దేశంలో సూపర్ ఎల్ నినో ప్రభావం ఉందని, మన రాష్ట్రంలో దీని ప్రభావంతో తక్కువగా వర్షం కురిసిందని పేర్కొన్నారు. జిల్లాలో వరిని వదిలి కూరగాయలు, ఆయిల్ పామ్ సాగు చేస్తున్న రైతుల క్షేత్రాలను ప్రతి మంగళవారం పరిశీలిస్తున్నామని తెలిపారు. వీబీజీరామ్ జీ కింద జల సంరక్షణ పనులు రైతులు చేసుకోవాలని సూచించారు. తమ వ్యవసాయ క్షేత్రంలో పామ్ పాండ్ కట్టుకోవాలని, బోర్‌వెల్ రీచార్జ్ పనులు చేసుకోవాలని పిలుపు నిచ్చారు. ఎస్పీ మహేష్ బి గితె మాట్లాడుతూ.. తాను వ్యవసాయ డిగ్రీ కోర్సు చదివానని, వ్యవసాయ అనుబంధ కార్యక్రమాల్లో ఎన్నో సార్లు చురుగ్గా పాల్గొన్నానని గుర్తుచేశారు. ఆదర్శ రైతులు, ప్రజాప్రతినిధులు, శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారుల సేవలు, నూతన టెక్నాలజీ విషయాలు నేర్చుకునేందుకు కిసాన్ మేళా లాంటి కార్యక్రమాలు ఎంతో మంచి వేదికని వివరించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్, ఆత్మ కమిటీ సిరిసిల్ల, వేములవాడ డివిజన్ చైర్మన్లు రాజిరెడ్డి, ముకుంద రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్లు సత్తు శ్రీనివాస్ రెడ్డి, హమీద్, మహేష్ రెడ్డి, పలు పీఏసీఎస్ చైర్మన్లు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అశ్విల్ బేగం, జిల్లా మత్స్య శాఖ అధికారి సౌజన్య, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి రవీందర్ రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి వీర భద్రయ్య, ఈడీ ఎస్సీ కార్పొరేషన్ స్వప్న, ఉద్యానవన శాఖ అధికారి శరత్ బాబు, సీపీఓ సంపత్ కుమార్ తదితరులు ఉన్నారు.

అన్నప్రసాదం

వేములవాడ, వీవీన్యూస్: రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ మండలం ఎదురుగట్ల గ్రామంలోని (శ్రీ వెంకటేశ్వర స్వా మి ఆలయంలో శనివారం అన్నప్రసాద వితరణ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ప్రతి శనివారం చేపట్టే ఈ కార్యక్రమంలో భాగంగా మధ్యాహ్నం 12 గంటల నుంచి ఆలయానికి వచ్చిన భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేశారు. ఈ వారం అన్నప్రసాద వితరణకు ఆరేపల్లి గ్రామ సర్పంచ్ ఇటిక్యాల రాజు నవీన దంపతులు దాతలుగా వ్యవహరించారు. ఈ సందర్భంగా భక్తులు స్వామివారిని దర్శించుకుని అభిషేకాలు, అర్చనలు నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నప్రసాదాన్ని స్వీకరించారు. అన్నదాన కార్యక్రమానికి సహకరించిన దాతల కుటుంబంపై వేంకటేశ్వర స్వామివారి ఆశీస్సులు ఎల్ల ప్పుడూ ఉండాలని భక్తులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సుమారు 150 మంది భక్తులు పాల్గొన్నారు. ఆలయ పూజారులు, సిబ్బంది, భక్తులు తదితరులు సేవలందించారు.



పంచారామ క్షేత్రాలకు ప్రత్యేక బస్సు ప్రారంభం

సిరిసిల్ల, వీవీన్యూస్: కార్తీకమాసం సందర్భంగా భక్తుల సౌకర్యార్థం తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ) సిరిసిల్ల డిపో ఆధ్వర్యంలో పంచారామ పుణ్యక్షేత్రాలకు ఏర్పాటు చేసిన ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సు శనివారం సాయంత్రం సిరిసిల్ల కొత్త బస్టాండ్ నుంచి బయలుదేరింది. ఈ ప్రత్యేక బస్సు ద్వారా అమరావతి, భీమవరం, పాలకొల్లు, ద్రాక్షారామం, సామర్లకోటలోని పంచారామ క్షేత్రాలను భక్తులు దర్శించుకోనున్నారు. క్షేత్రాల దర్శనం అనంతరం సోమవారం ఉదయం 11 గంటలకు తిరిగి సిరిసిల్లకు చేరుకోనుంది.బస్సు ప్రారంభ కార్యక్రమంలో సిరిసిల్ల డిపో మేనేజర్ భరత్ కుమార్, ట్రాఫిక్ ఇన్‌చార్జ్ ప్రకాశ్ రెడ్డి, ఏడీసీ రామ్ రెడ్డితో పాటు ఆర్టీసీ ఉద్యోగులు పాల్గొని ప్రయాణికులకు శుభాకాంక్షలు తెలిపారు.

ఫూలే సిద్ధాంతాలను యువత ఆదర్శంగా తీసుకోవాలి





కరీంనగర్, వీవీన్యూస్: కరీంనగర్ జిల్లా కొత్తపల్లి మండలం బద్దిపల్లి గ్రామంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ ఆధ్వర్యంలో మహాత్మా జ్యోతిరావు ఫూలే 136వ వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.<ఈ సందర్భంగా గ్రామ పెద్దలు, యువకులు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మోదుంపల్లి శ్రీకాంత్ మాట్లాడుతూ.. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి, మహిళా విద్య, కుల వివక్ష నిర్మూలన కోసం జీవితాంతం పోరాడిన మహనీయుడు జ్యోతిరావు ఫూలే అని కొనియాడారు. ఆయన ఆశయాలను కొనసాగించడం ప్రతి ఒక్కరి బాధ్యతని అన్నారు. సమానత్వం, విద్య, సామాజిక న్యాయం అనే ఫూలే సిద్ధాంతాలను యువత ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మోదుంపల్లి శ్రీకాంత్, గర్రెపల్లి వెంకటేష్, తాండ్ర మైపాల్, రాచకొండ రవి, కంకణాల రమేష్, తాండ్ర రాజు, తిరుపతి, పోలుదాసరి శరత్, వేములవాడ శ్రీకాంత్, రాచకొండ శీను, బత్తిని గణేష్, మాస గోని రమేష్, గర్రెపల్లి వినయ్, మాస గోని సన్నీ, కోడూరి శేఖర్, వివిధ పార్టీల నాయకులు, యువజన సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

ఫూలేకు ఘన నివాళి

వేములవాడ: రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ న్యూ అర్బన్ కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో మహాత్మా జ్యోతిరావు ఫూలే 136వ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు విక్కుర్తి లక్ష్మీ నారాయణ మాట్లాడుతూ.. కులవివక్ష నిర్మూలన, మహిళా విద్య, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం జ్యోతిరావు ఫూలే చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. ఫూలే ఆశయాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు దుర్గేటి లక్ష్మీ నారాయణ, కంకెల్కార్ మోహన్, అంగన్‌వాడీ ఉపాధ్యాయురాళ్లు లిక్కిడి మంజుల, పులి శారద, విద్యార్థులు పాల్గొన్నారు.

విగ్రహాలు ఏర్పాటు చేయాలి

వేములవాడ: మహాత్మ జ్యోతిరావు ఫూలే 136వ వర్ధంతి సందర్భంగా బహుజన సేన రాజన్న సిరిసిల్ల జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం వేములవాడ డివిజన్ కేంద్రంలో మహాత్మ జ్యోతిబా ఫూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మహాత్మ జ్యోతిబా ఫూలే ఆశయాలను స్మరించుకుంటూ ఆయన చేసిన సామాజిక సేవలు, విద్యా ఉద్యమాలు, సమానత్వ పోరాటాలను నాయకులు కొనియాడారు. వేము లవాడ పట్టణంలో మహాత్మ జ్యోతిరావు ఫూలే, సావిత్రిబాయి ఫూలే దంపతుల విగ్రహాలు లేకపోవడంతో వారి జయంతి, వర్ధంతి కార్యక్రమాలను ఘనంగా నిర్వ హించేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వేములవాడ పట్టణంలో అనువైన స్థలాన్ని కేటాయించి ఫూలే దంపతుల విగ్రహాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందించాలి

• డీఈఓ విజయ్ సాగర్



కరీంనగర్, వీవీన్యూస్: జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో శనివారం కరీంనగర్‌లోని రంగినేని ట్రస్టులో జిల్లాస్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్–2026 నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు పారం లక్ష్మీ నారాయణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి జిల్లా విద్యాధికారి జె. విజయ్ సాగర్ ముఖ్య అతిథిగా, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కనక శ్రీ విజయ రఘునందన్, జిల్లా సైన్స్ అధికారి పాముల దేవయ్య, రంగినేని ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు రంగినేని మోహన్ రావు తదితరులు విశిష్ట అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డీఈఓ విజయ్ సాగర్ మాట్లాడుతూ విద్యార్థులు బాల్యం నుంచే సైన్స్ పట్ల ఆసక్తి పెంపొందించుకుని శాస్త్రవేత్తలుగా ఎదగాలని సూచించారు. విజేతలు రాష్ట్రస్థాయిలోనూ ప్రతిభ చాటాలని ఆకాంక్షించారు. ప్రశ్నించడం నేర్చుకోవాలని, మూఢనమ్మకాలకు దూరంగా ఉండి శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలని విజయ రఘునందన్ పేర్కొన్నారు. పారం లక్ష్మీ నారాయణ మాట్లాడుతూ రాజన్న సిరిసిల్ల జిల్లాలో పాఠశాల స్థాయిలో 230 పాఠశాలల నుంచి 6 వేల మంది, మండల స్థాయిలో 400 మందికి పైగా పాల్గొన్నారని తెలిపారు. జిల్లా స్థాయి పోటీల్లో 13 మండలాల నుంచి సుమారు 120 మంది విద్యార్థులు పాల్గొన్నారని వివరించారు. జన విజ్ఞాన వేదిక 38 ఏళ్లుగా శాస్త్ర ప్రచారం, ఆరోగ్య రక్షణ, పర్యావరణ పరిరక్షణ, మూఢనమ్మకాల నిర్మూలనకు కృషి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ద్యావనపల్లి శ్రీహరి, సిలివేరి సంపత్ కుమార్, వెంకటేశ్వరరావు, చెన్న మానవుని రామరాజు, అంకుష్, గంప లక్ష్మీ నారాయణ, మెదపట్ల కిషన్, బురుక గోపాల్, గొర్రె రాజలింగం, మారంపల్లి రాజయ్య, రంజిత్ మహారాజ్, ఉప్పులేటి నరేష్, మండల కన్వీనర్లు, గైడ్ టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

గోమాతకు జాతీయ గౌరవం కల్పించాలి

• బీజేపీ జిల్లా అధ్యక్షులు రెడ్డబోయిన గోపీ



సిరిసిల్ల, వీవీన్యూస్: జిల్లా ధార్మిక సెల్ కన్వీనర్ డాక్టర్ సత్యనా రాయణ ఆధ్వర్యంలో 'గో సమ్మాన్ ఆహ్వాన్ అభియాన్' కార్యక్రమా న్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బీజేపీ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు రెడ్డబోయిన ప్రజల నుంచి మద్దతు సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ అభియాన్ ప్రధాన ఉద్దేశం దేశవ్యాప్తంగా సంపూర్ణ గోహత్య నిషేధం అమలు చేయడం, గోమాతకు జాతీయ గౌరవం కల్పించడం, గోరక్షణ, గోసేవ కోసం ప్రత్యేక చట్టాన్ని రూపొందించాలని ప్రభుత్వాన్ని కోరడం. ఈ లక్ష్యాలకు మద్దతుగా ప్రజల నుంచి సంతకాలను సేకరిస్తున్నారు. గో మాత సంరక్షణ, గోరక్షణ, గోసేవ పట్ల ప్రజల్లో అవగాహన కల్పిస్తూ ఈ అభియాన్‌ను ముందుకు తీసుకెళ్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శులు పొన్నాల తిరుపతిరెడ్డి, సిరికొండ శ్రీనివాస్, ధార్మిక సెల్ జిల్లా కో–కన్వీనర్ గొట్టే రామచంద్రం, గంభీరావుపేట మండల అధ్యక్షులు కోడె రమేష్, సిరిసిల్ల ధార్మిక సెల్ అధ్యక్షులు గాలి శ్రీనివాస్, కో–కన్వీనర్ ఏం. వేముల పోశెట్టి, వేములవాడ అర్బన్ ధార్మిక సెల్ కన్వీనర్ పేరగాని మల్లేశం, కో–కన్వీనర్ మాంజేటి రాంబాబు తదితరులున్నారు.



150 ఏళ్ల తర్వాత కొండపై కార్తీక దీపం

• సుప్రీంకోర్టు ఆదేశాలతో తిరుప్పరన్‌కుండ్రంలో దీపోత్సవం • సీఆర్‌పీఎఫ్ భద్రత మధ్య రాతి దీపస్తంభం వద్ద ప్రజ్వలన
• 30 కిలోల నెయ్యి, ఐదు కిలోల కర్పూరంతో భారీ దీపం • దశాబ్దాల న్యాయపోరాటానికి ముగింపు.. ఆనందంతో భక్తుల సంబరాలు

మధురై: తమిళనాడులోని మధురై సమీప తిరుప్పరన్‌కుండ్రం కొండపై కార్తీక దీపం వెలిగింది. దాదాపు 150 ఏళ్ల తర్వాత తొలిసారిగా కొండపై ఉన్న రాతి దీపస్తంభం (దీపత్తూన్) వద్ద శనివారం సాయంత్రం 5 గంటలకు జ్యోతిని ప్రజ్వలించారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు కేంద్ర రిజర్వు పోలీసు బలగాల (సీఆర్‌పీఎఫ్) కట్టుదిట్టమైన భద్రత మధ్య కార్యక్రమం నిర్వహించారు. 'వెట్రివేల్.. వీరవేల్' అంటూ భక్తుల నినాదాలతో కొండ ప్రాంతం మార్మోగింది. ఎన్నో ఏళ్లుగా ఈ స్థలంలో దీపం వెలిగించాలని పోరాడుతున్న భక్తులకు ఈ ఘటన చారిత్రక ఘట్టంగా నిలిచింది. సుప్రీంకోర్టు నియమించిన మాజీ న్యాయమూర్తులు ఎస్.వైద్యనాథన్, వి.పార్థిబన్ సమక్షంలో దీపాన్ని వెలిగించారు. మధురై జిల్లా కలెక్టర్ నిశాంత్ కృష్ణతో పాటు సుమారు 75 మంది మాత్రమే దీపస్తంభం సమీపంలో ఉన్నారు. మిగిలిన భక్తులు సమీపంలోని ఫ్లైఓవర్, భవనాల పైకప్పులు, మేడలపై నుంచి జ్యోతి ప్రజ్వలనను వీక్షించారు. దీపం వెలిగిన వెంటనే పలువురు భక్తులు ఆనందంతో కన్నీళ్లు పెట్టుకోగా, మరికొందరు పూలు చల్లి సంబరాలు చేసుకున్నారు. కొందరు తమ పైవస్త్రాలను తిప్పుతూ ఆనందం వ్యక్తం చేశారు.



30 కిలోల నెయ్యితో దీపం

దీపం వెలిగించేందుకు ప్రత్యేకంగా మట్టి పాత్రను సిద్ధం చేశారు. అందులో సుమారు 50 మీటర్ల పొడవైన వత్తిని ఉంచి, 30 కిలోల నెయ్యి, ఐదు కిలోల కర్పూరాన్ని వినియోగించారు. పూజలు, హారతి అనంతరం సాయంత్రం 5 గంటలకు జ్యోతిని వెలిగించారు. శంఖాలు పూరిస్తూ, సంప్రదాయ వాయిద్యాలు మోగిస్తూ భక్తులు వేడుక చేసుకున్నారు. స్థానికులు బాణసంచా కాల్చారు. దీపావళి తర్వాత కొన్ని రోజులకు వచ్చే కార్తిగై దీపం సందర్భంగా తమిళనాడులో బాణసంచా కాల్చడం సంప్రదాయం.

నాలుగు దశాబ్దాలుగా న్యాయపోరాటం

తిరుప్పరన్‌కుండ్రం కొండపై దీపస్తంభం వద్ద దీపం వెలిగించేందుకు గతంలో 1862, 1912లో ప్రయత్నాలు జరిగినప్పటికీ అవి ఫలించలేదు. 19వ శతాబ్దం మధ్యకాలానికి ముందు ఈ ప్రాంతంలో దీపం వెలిగించారా లేదా అన్నది స్పష్టంగా తెలియడం లేదు. 1990వ దశకం ప్రారంభంలో హిందూ మున్నని సంస్థ ఈ అంశంపై ప్రజాభిప్రాయాన్ని సమీకరించి ఉద్యమాన్ని ప్రారంభించింది. అప్పటి నుంచి దాదాపు నాలుగు దశాబ్దాలుగా న్యాయపోరాటం కొనసాగుతోంది. ఈ వివాదంపై నవంబరు 20న సుప్రీంకోర్టు ఒకసారి మినహాయింపుగా దీపస్తంభం వద్ద జ్యోతి వెలిగించేందుకు అనుమతించింది. అయితే నవంబరు 24న నిర్దేశిత స్థలంలో కాకుండా ఉచ్చిపిళ్లయార్ మండపం వద్ద మాత్రమే దీపం వెలిగించారు. దీంతో కోర్టు ఆదేశాలను ఉద్దేశపూర్వకంగా ఉల్లంఘించారంటూ శుక్రవారం తమిళనాడు ప్రభుత్వానికి సుప్రీంకోర్టు ధిక్కరణ నోటీసు జారీ చేసింది. శనివారం దీపస్తంభం వద్దే దీపం వెలిగించాలని ఆదేశించింది. ఆలయ ధర్మకర్తల మండలిని కూడా సస్పెండ్ చేసి, ఆలయం, కొండ భద్రతను సీఆర్‌పీఎఫ్‌కు అప్పగించింది.

ఆలయం, దర్గాతో ముడిపడిన వివాదం

తిరుప్పరన్‌కుండ్రం తమిళనాడులోని ప్రముఖ హిందూ పుణ్యక్షేత్రాల్లో ఒకటి. ఇక్కడి అరుళ్మిగు సుబ్రమణ్యస్వామి ఆలయం మురుగన్ స్వామి ఆరు పవిత్ర క్షేత్రాల్లో మొదటిదిగా ప్రసిద్ధి చెందింది. కొండపై అత్యున్నత ప్రాంతంలో హజ్రత్ సుల్తాన్ సికందర్ బాదుషా ఔలియా దర్గా, దానికి సమీపంలో మసీదు ఉన్నాయి. ఈ మతపరమైన ప్రదేశాలు తరతరాలుగా పక్కపక్కనే ఉన్నప్పటికీ, భూమి హక్కులు, ప్రవేశం, మతపరమైన హక్కుల విషయంలో అప్పుడప్పుడు వివాదాలు తలెత్తుతున్నాయి. బ్రిటిష్ పాలన నాటి సివిల్ కోర్టు, ప్రివీ కౌన్సిల్ తీర్పుల ఆధారంగా మద్రాస్ హైకోర్టు గతంలో కీలక తీర్పులు ఇచ్చింది. దర్గా, నెల్లితోపు సమాధుల స్థలం వంటి కొన్ని ప్రాంతాలు మినహా కొండలో అధిక భాగం ఆలయానికి చెందుతుందని స్పష్టం చేసింది. ఆలయానికి చెందిన పైభాగంలోని ఇతర ప్రదేశాల్లోనూ దీపం వెలిగించే హక్కు భక్తులకు ఉందన్నది హిందూ సంస్థలు, కొందరు భక్తుల వాదన. కొండపై కార్తిగై దీపం వెలిగించే సంప్రదాయం ఉన్నందున దీపస్తంభం వద్ద కూడా అనుమతించాలని వారు కోరుతున్నారు. ఈ వివాదం గత ఏడాది తమిళనాడు వెలుపల కూడా చర్చనీయాంశమైంది. దీపం వెలిగించేందుకు హైకోర్టు అనుమతించినప్పటికీ అప్పటి ప్రభుత్వం చర్యలు తీసుకోలేదని ఆరోపణలు వచ్చాయి. ఈ అంశంపై గతంలో ఆందోళనలు, ఘర్షణలు చోటుచేసుకున్నాయి. దీపం వెలిగించాలనే డిమాండ్‌తో మధురైకి చెందిన ఆటో డ్రైవర్ పూర్ణచంద్రన్ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కూడా అప్పట్లో కలకలం రేపింది.





కోడెల సంరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలి

• బీజేపీ వేములవాడ పట్టణ శాఖ అధ్యక్షుడు రాపెల్లి శ్రీధర్ డిమాండ్

వేములవాడ, వీవీన్యూస్: వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో కోడెల సంరక్షణపై అధికారులు నిర్లక్ష్యం వీడాలని బీజేపీ వేములవాడ పట్టణ శాఖ అధ్యక్షుడు రాపెల్లి శ్రీధర్ డిమాండ్ చేశారు. కోడెమొక్కుల ద్వారా ఆలయానికి కోట్లాది రూపాయల ఆదాయం వస్తున్నప్పటికీ, వాటి సంరక్షణకు తగిన చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. ఇటీవల మూడు కోడెలు మృతి చెందిన ఘటనపై ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. వేములవాడలోని పద్మశాలి భవన్‌లో బీజేపీ పట్టణ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన మీడియా సమావేశంలో శ్రీధర్ మాట్లాడారు. కోడెల సంరక్షణ కోసం 30 ఎకరాల భూమి కేటాయిస్తామని గతంలో ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని కోరారు. మూడు రోజుల్లోగా వెటర్నరీ వైద్యులను నియమించి, కోడెల సంరక్షణకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే పెద్ద ఎత్తున ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ ముత్యం మాట్లాడుతూ కోడెల సంరక్షణపై ఆలయ అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని కోరారు. సమావేశంలో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి రేగుల శ్రీకాంత్, కౌన్సిలర్లు వంగల శీను, ముత్యం, పార్టీ నాయకులు పాల్గొన్నారు.







మహాత్మా జ్యోతిరావు పూలే వర్ధంతి సందర్భంగా ఫిలింనగర్ చౌరస్తాలోని పూలే దంపతుల విగ్రహాలకు జూబ్లీహిల్స్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు కాటూరి రమేష్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్. ఎల్లయ్య, ఓర్సు శీను, నరసింహ, గిరై ఆంధ్ర శీను, బెంజిమెన్, జగన్, మందల రమేష్, బనవరాజు, శివకుమార్, వెంకటయ్య, రవి నాయక్, రంగా తదితరులు పాల్గొన్నారు.

– ఖైరతాబాద్, వీవీన్యూస్

దీక్షా దివస్‌కు అలుగునూరు సిద్ధం

- కేసీఆర్ నిరాహార దీక్షకు బయల్దేరిన చారిత్రక ఘట్టానికి 17 ఏళ్లు
- నేడు అలుగునూర్‌లో బీఆర్ఎస్ భారీ బహిరంగ సభ
- మధ్యాహ్నం 3 గంటలకు కార్యక్రమం.. ముఖ్య అతిథిగా హాజరుకానున్న కేటీఆర్

కరీంనగర్, వీవీన్యూస్: తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమ చరిత్రలో కీలక ఘట్టమైన 'దీక్షా దివస్'కు కరీంనగర్ జిల్లా అలుగునూరు ముస్తాబైంది. ఈ సందర్భంగా ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు తిమ్మాపూర్ మండలం అలుగునూరు చౌరస్తా వద్ద బీఆర్ఎస్ ఆధ్వర్యంలో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నారు. పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. సభకు అవసరమైన ఏర్పాట్లను పార్టీ శ్రేణులు పూర్తి చేశాయి. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం 2009 నవంబరు 29న అప్పటి టీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నిరవధిక నిరాహార దీక్షకు బయలుదేరారు. ఆ సమయంలో పోలీసులు అలుగునూరు చౌరస్తా వద్దే ఆయనను అరెస్టు చేసి ఖమ్మం కారాగారానికి తరలించారు. అక్కడ కూడా కేసీఆర్ తన దీక్షను కొనసాగించారు. మొత్తం 11 రోజులపాటు నిరాహార దీక్ష చేపట్టారు. ఈ చారిత్రక ఘట్టానికి 17 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా నాటి ఉద్యమ స్ఫూర్తిని నేటి తరానికి తెలియజేసేందుకు అలుగునూరులో సభ నిర్వహిస్తున్నట్లు పార్టీ నాయకులు తెలిపారు. సభ ఏర్పాట్లను శనివారం కరీంనగర్, హుజూరాబాద్ ఎమ్మెల్యేలు గంగుల కమలాకర్, పాడి కౌశిక్‌రెడ్డి పరిశీలించారు. మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ తదితరులు ఏర్పాట్లను సమీక్షించారు.

అండాల అక్రమ దందాలో రూ.487 కోట్ల లావాదేవీలు

- మరో ఇద్దరి అరెస్టు.. 14కు చేరిన నిందితుల సంఖ్య

హైదరాబాద్, వీవీన్యూస్: నగరంలో సంచలనం సృష్టించిన అండాల అక్రమ సేకరణ వ్యవహారంలో విస్తుపోయే అంశాలు వెలుగులోకి వస్తున్నాయి. ఈ దందా వెనుక సద్గురు హెల్త్‌కేర్ సర్వీస్ సెంటర్ కీలకంగా వ్యవహరించినట్లు పోలీసులు గుర్తించారు. కేవలం ఎనిమిది నెలల్లోనే ఈ ముఠా రూ.487.82 కోట్ల మేర లావాదేవీలు జరిపినట్లు వెల్లడించారు. తాజాగా మరో ఇద్దరిని అరెస్టు చేయడంతో ఈ కేసులో నిందితుల సంఖ్య 14కు చేరింది. మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ సుమతి శనివారం కేసు వివరాలను వెల్లడించారు. సద్గురు హెల్త్‌కేర్ హైదరాబాద్ సీవోవో ప్రతీక్ అనిల్ గంగ్లానీ, ఒయాసిస్ ఫర్టిలిటీ మెడికల్ అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ రాజశ్రీ దేవ్‌ను అరెస్టు చేసినట్లు తెలిపారు. దర్యాప్తులో భాగంగా డాక్టర్ దుర్గారావు పేద మహిళలను గుర్తించి తీసుకువచ్చేవారని, వారి నుంచి సేకరించిన అండాలను గంగ్లానీ, రాజశ్రీ దేవ్ దేశవ్యాప్తంగా ఉన్న ఇతర ఫర్టిలిటీ కేంద్రాలకు సరఫరా చేసేవారని తేలినట్లు వివరించారు. అరెస్టయిన ఇద్దరు ఎగ్జిక్యూటివ్‌లు నెలకు రూ.3.5 లక్షల నుంచి రూ.4.5 లక్షల వరకు వేతనాలు పొందుతున్నట్లు గుర్తించారు.

43 కేంద్రాలతో నెట్‌వర్క్

ఈ అక్రమ వ్యవహారం దేశవ్యాప్తంగా 43 ఫర్టిలిటీ కేంద్రాలకు విస్తరించినట్లు పోలీసులు గుర్తించారు. ఈ కేంద్రాల ద్వారా నెలకు సుమారు 100 మంది మహిళల నుంచి అండాలను సేకరిస్తున్నట్లు ప్రాథమికంగా అంచనా వేశారు. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ఖాతాల ద్వారా ఏప్రిల్ నుంచి నవంబరు 26 వరకు రూ.487.82 కోట్ల లావాదేవీలు జరిగినట్లు సీపీ వెల్లడించారు.



850 స్థానాలతో ప్రజాస్వామ్యానికి ముప్పు

ఎన్నికల పటాన్ని తమకు అనుకూలంగా మార్చుకునేందుకే కేంద్రం ప్రతిపాదన

- మోదీ, అమిత్‌షా, ఎన్నికల కమిషనర్‌కు పూర్తి స్వేచ్ఛ ఇచ్చినట్లే
- 543 స్థానాలనే కొనసాగించాలి.. కులగణన తర్వాతే డీలిమిటేషన్ చేపట్టాలి: రాహుల్‌గాంధీ

న్యూఢిల్లీ: దేశాన్ని నియంతృత్వం వైపు నడిపించేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ ఆరోపించారు. లోక్‌సభ స్థానాల సంఖ్యను 850కి పెంచాలన్న కేంద్ర ప్రభుత్వ ప్రతిపాదన ప్రజాస్వామ్యాన్ని బలహీనపరిచే చర్యగా అభివర్ణించారు. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌కు దేశ ఎన్నికల పటాన్ని తమకు అనుకూలంగా మార్చుకునే అవకాశం కల్పించడమే ఈ ప్రతిపాదన వెనుక ఉద్దేశమని విమర్శించారు. శనివారం ఢిల్లీలో ఇండియా కూటమి పార్టీల సభా నాయకులతో రెండు గంటలపాటు సమావేశమైన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. లోక్‌సభ స్థానాలను 850కి ఎందుకు పెంచాలనుకుంటున్నారని రాహుల్ ప్రశ్నించారు. అసోం, జమ్మూకశ్మీర్‌లో చోటుచేసుకున్న పరిణామాలను పరిశీలిస్తే ఈ ప్రతిపాదన వెనుక ఉద్దేశం అర్థమవుతుందన్నారు. 850 స్థానాలను తమకు అనుకూలంగా మలుచుకునే అవకాశం లభిస్తే ఎన్నికల పటాన్ని మార్చి, తమను వ్యతిరేకించే వర్గాల ప్రాతినిధ్యాన్ని తగ్గించవచ్చని ఆరోపించారు. ప్రతిపక్ష నేతలను లక్ష్యంగా చేసుకునే అవకాశం కూడా ఉంటుందని విమర్శించారు. ఒక్క ఓటు కూడా పోలవకముందే బీజేపీకి భారీ రాజకీయ ప్రయోజనం కల్పించేలా ఈ ప్రతిపాదన ఉందన్నారు. '850 అనే సంఖ్య భారత ప్రజాస్వామ్య హత్యకు ప్రతీక. దేశ ఎన్నికల పటాన్ని తిరిగి గీయడానికి మోదీ, అమిత్‌షా, జ్ఞానేశ్ కుమార్‌లకు ఖాళీ కాగితం అందించడమే దీని ఉద్దేశం' అని వ్యాఖ్యానించారు. ఎన్నికల సంఘం ఇప్పటికే ప్రభుత్వ ఆధీనంలోకి వెళ్లిందని ఆరోపించిన రాహుల్.. ఇప్పుడు డీలిమిటేషన్ కమిషన్‌ను కూడా తమ నియంత్రణలోకి తీసుకోవాలని చూస్తున్నారని అన్నారు.

సామాజిక న్యాయానికి విఘాతం

నియోజకవర్గాల పునర్విభజనలో సామాజిక న్యాయం కీలక అంశమని రాహుల్ పేర్కొన్నారు. కులగణనను పక్కన పెట్టారని, 2027 జనగణనలో వెల్లడయ్యే వాస్తవాలు బీజేపీకి ఇబ్బందికరంగా మారతాయని అన్నారు. ఎస్సీ, ఎస్టీ జనాభా పెరిగినా.. అందుకు అనుగుణంగా వారికి లోక్‌సభలో ప్రాతినిధ్యం పెరగకుండా అడ్డుకునే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. ఈ పరిణామం ఆయా వర్గాల హక్కులకు భంగం కలిగించడంతో పాటు మైనారిటీల ప్రాతినిధ్యాన్ని కూడా బలహీనపరుస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతమున్న 543 లోక్‌సభ స్థానాలనే కొనసాగించాలని రాహుల్ డిమాండ్ చేశారు. 2027 జనగణన, కులగణన వివరాల ఆధారంగా నియోజకవర్గాల పునర్విభజన చేపట్టాలని సూచించారు. అన్ని రాజకీయ పార్టీల భాగస్వామ్యంతో డీలిమిటేషన్ కమిషన్‌ను ఏర్పాటు చేయాలని, రాష్ట్రాల ప్రాతినిధ్యంలో ఎలాంటి మార్పులు చేయకూడదని కోరారు. 543 స్థానాల పరిధిలోనే మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని, అందులో ఓబీసీలకు ఉపకోటా కల్పించాలని డిమాండ్ చేశారు.

ఎన్నికల సంఘంపైనా విమర్శలు

2024 ఎన్నికలు చట్టవిరుద్ధంగా జరిగాయని, నరేంద్ర మోదీ ప్రధానిగా కొనసాగడం కూడా చట్టబద్ధం కాదని రాహుల్ ఆరోపించారు. ఎన్నికల్లో అక్రమాలు జరుగుతున్నాయనే విషయం ప్రజలకు తెలుసని, యువతలోనూ దీనిపై అవగాహన ఉందని వ్యాఖ్యానించారు. అదానీ, మోదీ, అమిత్‌షా, జ్ఞానేశ్ కుమార్‌లపై తీవ్ర విమర్శలు చేశారు. ప్రజల సంపదను దోచుకుంటున్నారని ఆరోపిస్తూ, ఈ ప్రయత్నాలను కాంగ్రెస్ అడ్డుకుంటుందని స్పష్టం చేశారు.

బిల్లుకు బీఆర్ఎస్ మద్దతు

హైదరాబాద్, వీవీన్యూస్: కేంద్రం ప్రతిపాదించిన డీలిమిటేషన్ బిల్లుకు బీఆర్ఎస్ మద్దతు ప్రకటించింది. నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా 50 శాతం సీట్ల పెంపుతోపాటు 2051 వరకు రాష్ట్రాల మధ్య ప్రాతినిధ్య నిష్పత్తిని మార్చకుండా రక్షణ కల్పించాలన్న ప్రతిపాదన తమ ప్రధాన ఆందోళనకు పరిష్కారం చూపుతోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. దీనివల్ల దక్షిణాది రాష్ట్రాలకు ప్రస్తుతం ఉన్న 24 శాతం పార్లమెంటరీ ప్రాతినిధ్య వాటాకు రక్షణ లభిస్తుందని పేర్కొన్నారు. తెలంగాణ లోక్‌సభ స్థానాలు 17 నుంచి 26కు పెరిగే అవకాశం ఉందన్నారు. తెలంగాణ ప్రయోజనాలే తమకు ముఖ్యమని, డీలిమిటేషన్ ప్రతిపాదనకు అనుకూలంగా తమ పార్టీకి చెందిన ముగ్గురు రాజ్యసభ సభ్యులు ఓటు వేస్తారని కేటీఆర్ ఒక ప్రకటనలో వెల్లడించారు. మహిళా రిజర్వేషన్లకు బీఆర్ఎస్ ఎప్పుడూ మద్దతు ఇస్తోందని, వాటి అమలుకు కట్టుబడి ఉందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ స్పష్టం చేశారు.



తెలంగాణ ఉద్యమంలో కేసీఆర్ చేపట్టిన నిరాహార దీక్షను గుర్తుచేసుకుంటూ నిర్మల్ జిల్లా ముఖ్రా (కె) గ్రామ రైతులు వినూత్నంగా దీక్షా దివస్ వేడుకలు నిర్వహించారు. ఆదివారం దీక్షా దివస్ నేపథ్యంలో ఒకరోజు ముందుగానే శనివారం గ్రామంలో ఉత్సవాలను ప్రారంభించారు. కేసీఆర్ చిత్రపటాన్ని ఎడ్లబండిపై ఉంచి, దప్పుల నడుమ పంట పొలాల వద్దకు తీసుకెళ్లారు. అక్కడ చిత్రపటానికి పుష్పాభిషేకం, పాలాభిషేకం చేశారు. 2009 నవంబరు 29న తెలంగాణ రాష్ట్ర సాధన కోసం కేసీఆర్ ఆమరణ నిరాహార దీక్ష చేపట్టారని, 'తెలంగాణ వచ్చుడో.. కేసీఆర్ సచ్చుడో' అన్న నినాదంతో సాగించిన పోరాటం రాష్ట్ర ఆవిర్భావానికి కీలక మలుపుగా నిలిచిందని గ్రామస్థులు పేర్కొన్నారు. కేసీఆర్ సాహసాన్ని, త్యాగాన్ని ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. 2001లో తెలంగాణ ఉద్యమాన్ని ప్రారంభించి, రాష్ట్ర సాధన వరకు వెనక్కి తగ్గని నాయకుడని కొనియాడారు. కేసీఆర్ పాలనలో తెలంగాణ అన్ని రంగాల్లో అభివృద్ధి చెంది దేశానికి ఆదర్శంగా నిలిచిందని వారు అన్నారు. మళ్లీ ఆయన నాయకత్వం వస్తేనే రాష్ట్ర ప్రజల బతుకులు బాగుపడతాయని అభిప్రాయపడ్డారు. తెలంగాణకు కేసీఆర్ నాయకత్వమే శ్రీరామరక్ష అని పేర్కొన్నారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్యే అనిల్ జాదవ్ నాయకత్వంలో పార్టీ బలోపేతానికి నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. కేటీఆర్ పిలుపు మేరకు ముందస్తుగా దీక్షా దివస్ వేడుకలు నిర్వహించినట్లు గ్రామస్థులు చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గాద్దే మీనాక్షి, మాజీ ఎంపీటీసీ గాద్దే సుభాష్‌తో పాటు పలువురు గ్రామస్థులు పాల్గొన్నారు.

– నిర్మల్, వీవీన్యూస్



చిన్న రైతులకు వ్యవసాయాన్ని లాభసాటిగా మారుస్తాం

- కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్

మథుర: చిన్న రైతులకు వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడం, పేదరికం లేని గ్రామాలను నిర్మించడం ప్రభుత్వ ప్రధాన ప్రాధాన్యాలని కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ తెలిపారు. రైతుల ఆదాయం పెరగాలంటే వ్యవసాయ పెట్టుబడి ఖర్చులను తగ్గించడంతోపాటు ఉత్పత్తిని పెంచాల్సిన అవసరం ఉందన్నారు. శనివారం మథురలోని పర్ఖమ్ గ్రామంలో దీన్‌దయాళ్ కామధేను గోశాల సమితి నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి పనులను ప్రారంభించడంతోపాటు మరికొన్ని పనులకు శంకుస్థాపన చేశారు. ప్రకృతి వ్యవసాయం, సమగ్ర వ్యవసాయ విధానాలను ఉద్యమంలా ముందుకు తీసుకెళ్లాలని చౌహాన్ సూచించారు. ఆవు పేడ, మూత్రం, మజ్జిగ, మట్టితో ప్రకృతి వ్యవసాయం చేయవచ్చని తెలిపారు. రైతులు పశుపోషణ, ముఖ్యంగా ఆవుల పెంపకంపై దృష్టి సారించాలని కోరారు. వ్యవసాయంపైనే ఆధారపడకుండా పశుపోషణ వంటి అనుబంధ రంగాల ద్వారా అదనపు ఆదాయం పొందేలా గ్రామాలు అభివృద్ధి చెందాలని అన్నారు. దీన్‌దయాళ్ గోశాల సమితి నిర్వహిస్తున్న ప్రయోగశాల, పంచగవ్య పరిశోధనలను మంత్రి అభినందించారు. సమితి సభ్యులకు ప్రభుత్వ సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. రైతులు తమ భూమిలో కొంత భాగంలోనైనా తొలుత ప్రకృతి వ్యవసాయం ప్రారంభించాలని సూచించారు. సరైన పద్ధతుల్లో సాగు చేస్తే దిగుబడులు తగ్గవని, పెట్టుబడి ఖర్చులు తగ్గి లాభాలు పెరుగుతాయని హామీ ఇచ్చారు. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం గత కొన్నేళ్లలో 50 కోట్ల మందిని పేదరికం నుంచి బయటకు తీసుకొచ్చిందని చౌహాన్ తెలిపారు. దేశాన్ని మద్య, ఇతర వ్యసనాల రహితంగా మార్చేందుకు ప్రజలంతా కృషి చేయాలని పిలుపునిచ్చారు. మద్యానికి దూరంగా ఉండి పాలను తీసుకోవాలని సూచించారు.

డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యం


- కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి



హైదరాబాద్, వీవీన్యూస్: మాదకద్రవ్యాల రహిత సమాజ నిర్మాణమే లక్ష్యంగా హైదరాబాద్‌లో మూడు రోజులపాటు నిర్వహించిన 'నషాముక్త్ భారత్' పాదయాత్ర విజయవంతమైందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి తెలిపారు. యువతతో పాటు భావితరాలను మాదకద్రవ్యాల ముప్పు నుంచి కాపాడాలనే సంకల్పంతో ప్రధాని మోదీ ఇచ్చిన పిలుపు మేరకు ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు శనివారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. పాదయాత్రలో వేలాది మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొనడం స్ఫూర్తినిచ్చిందన్నారు. ఇది రాజకీయాలకు అతీతంగా సమాజ శ్రేయస్సు కోసం చేపట్టిన ఉద్యమమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమానికి మద్దతుగా నిలిచిన సినీ నటులు చిరంజీవి, నాగార్జున, వెంకటేశ్, ప్రభాస్, సాయికుమార్, బెల్లంకొండ సాయిశ్రీనివాస్, దర్శకుడు బోయపాటి శ్రీను, నటి పాయల్ రాజ్‌పుత్, బ్యాడ్మింటన్ జాతీయ కోచ్ పుల్లెల గోపీచంద్‌తో పాటు వివిధ రంగాల ప్రముఖులు, వ్యాపారవేత్తలు, స్వచ్ఛంద సంస్థలు, సామాజిక కార్యకర్తలకు కిషన్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. 'డ్రగ్స్ వద్దు.. జీవితం ముద్దు' అనే నినాదాన్ని ప్రతి ఇంటికీ తీసుకెళ్లాలని, నషాముక్త్ భారత్ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు.

మహిళా రిజర్వేషన్ చరిత్రాత్మకం

మహిళలకు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్లు కల్పించే నిర్ణయం చరిత్రాత్మకమని కిషన్‌రెడ్డి మరో ప్రకటనలో పేర్కొన్నారు. ప్రధాని మోదీ నాయకత్వంలోని కేంద్ర మంత్రివర్గం తీసుకున్న ఈ నిర్ణయం లోక్‌సభ, రాష్ట్ర శాసనసభల్లో మహిళల ప్రాతినిధ్యాన్ని పెంచేందుకు దోహదపడుతుందని తెలిపారు. 'నారీ శక్తి వందన్ అధినియం' ద్వారా చట్టసభల్లో మహిళలకు మరిన్ని అవకాశాలు లభిస్తాయని కొనియాడారు.



ప్లేటులో మాంసం ఉంటేనే భోజనం పూర్తయినట్లు భావించే వారెందరో! చికెన్, మటన్, చేపలు.. ఇలా రకరకాల మాంసాహార వంటకాలకు రోజురోజుకూ ఆదరణ పెరుగుతోంది. శరీరానికి అవసరమైన ప్రొటీన్లు, ఐరన్, విటమిన్ బి12 వంటి పోషకాలు అందించే మాంసాహారం.. మితిమీరితే అనారోగ్య సమస్యలకూ కారణమవుతోంది. మేలు చేసే ఆహారమే ముప్పుగా మారకుండా చూసుకోవాల్సిన అవసరాన్ని వైద్య నిపుణులు గుర్తుచేస్తున్నారు.



బలానికి ప్రొటీన్లు కావాలి.. రక్తహీనతను నివారించడానికి ఐరన్ అవసరం.. నాడీ వ్యవస్థ సక్రమంగా పనిచేయడానికి విటమిన్ బి12 కీలకం. ఈ పోషకాలన్నీ అందించే ఆహార పదార్థాల్లో మాంసం కూడా ఒకటి. అయితే మాంసం రకం, వండే విధానం, తినే పరిమాణం ఆరోగ్యంపై ప్రభావం చూపుతాయి. ముఖ్యంగా ప్రాసెస్ చేసిన మాంసం, అధిక కొవ్వు పదార్థాలు, అతిగా తీసుకునే ఎర్ర మాంసం అనారోగ్య ముప్పును పెంచుతాయి.

మాంసాహారం.. మేలెంత.. ముప్పెంత?



మాంసాహారంలో తెలంగాణదే ప్రత్యేక స్థానం. దేశ సగటుతో పోలిస్తే రాష్ట్రంలో తలసరి మాంసం లభ్యత దాదాపు నాలుగు రెట్లు ఎక్కువగా ఉంది. పల్లెల్లో గొర్రె, మేక మాంసానికి.. పట్టణాల్లో చికెన్‌కు విపరీతమైన ఆదరణ ఉండటంతో మాంసం వినియోగానికి భారీ మార్కెట్ ఏర్పడింది. కేంద్ర ప్రభుత్వ తాజా గణాంకాల ప్రకారం రాష్ట్రంలో ఏడాదికి తలసరి మాంసం లభ్యత 28.78 కిలోలు. అయితే ఈ ఆహారపు అలవాట్లు ఆరోగ్యంపై ఎలాంటి ప్రభావం చూపుతున్నాయి? మాంసాహారం ఎంతవరకు మేలు చేస్తుంది?

పండుగలు, పెళ్లిళ్లు, శుభకార్యాలే కాదు.. సాధారణ రోజుల్లోనూ మాంసాహారానికి ప్రాధాన్యం పెరుగుతోంది. ఒకప్పుడు ప్రత్యేక సందర్భాల్లో మాత్రమే తినే మటన్, చికెన్ ఇప్పుడు నిత్యాహారంలో భాగమయ్యాయి. పెరుగుతున్న డిమాండ్‌కు అనుగుణంగా మాంసం ఉత్పత్తి, మార్కెట్ విస్తరిస్తున్నాయి. మరోవైపు అతిగా మాంసం తినడం వల్ల ఎదురయ్యే ఆరోగ్య సమస్యలపై ఆందోళన పెరుగుతోంది.

ఆదివారం వచ్చిందంటే చాలు.. చాలా ఇళ్లలో మాంసం వంటకాల నందడి కనిపిస్తుంది. చికెన్, మటన్, చేపలు.. ఇలా రకరకాల మాంసాహార పదార్థాలకు ప్రజలు ప్రాధాన్యం ఇస్తున్నారు. పండుగలు, శుభకార్యాలకే పరిమితమైన మాంసాహారం ఇప్పుడు నిత్య జీవితంలో భాగమవుతోంది. శరీరానికి అవసరమైన ప్రొటీన్లు, ఐరన్, విటమిన్ బి12 వంటి పోషకాలను అందించే మాంసం.. అతిగా తింటే అనారోగ్య సమస్యలకూ కారణమవుతోంది. ఒకవైపు మాంసం ఉత్పత్తి, వినియోగానికి సంబంధించిన మార్కెట్ విస్తరిస్తుండగా.. మరోవైపు అధిక మాంసాహారం వల్ల ఎదురయ్యే ఆరోగ్య సమస్యలపై ఆందోళన వ్యక్తమవుతోంది. దేశంలో మాంసం ఉత్పత్తిలో తెలంగాణ ఐదో స్థానంలో ఉండగా, తలసరి మాంసం లభ్యతలో మాత్రం అగ్రస్థానంలో నిలుస్తోంది. ఈ నేపథ్యంలో మాంసాహారం వల్ల కలిగే ప్రయోజనాలు, నష్టాలు, రాష్ట్రంలో పెరుగుతున్న మాంసం రంగం తీరుతెన్నులు ఆసక్తికరంగా మారాయి.

– వీవీన్యూస్,
ప్రత్యేక కథనం

తెలంగాణలో చికెన్, మటన్‌కు పెరిగిన ఆదరణ

- తెలంగాణలో చికెన్, మటన్‌కు పెరిగిన ఆదరణ
- మాంసం ఉత్పత్తిలో రాష్ట్రం వాటా 10.48 శాతం
- తలసరి లభ్యతలో అగ్రస్థానం
- మాంసాహారంతో శరీరానికి అవసరమైన పోషకాలు
- ప్రొటీన్లు, ఐరన్, విటమిన్ బీ12తో ప్రయోజనాలు
- వండే పద్ధతిలోనూ జాగ్రత్తలు తప్పనిసరి
- ప్రాసెస్ చేసిన మాంసంతో క్యాన్సర్ ముప్పు
- అతిగా తింటే గుండెజబ్బులు, క్యాన్సర్ ముప్పు



మాంసం ఉత్పత్తిలో ఐదో స్థానంలో ఉన్న తెలంగాణ.. తలసరి మాంసం లభ్యతలో మాత్రం దేశంలోనే మొదటి స్థానంలో ఉంది. కేంద్ర ప్రభుత్వ నివేదిక ప్రకారం 2024–25లో రాష్ట్రంలో ఏడాదికి తలసరి మాంసం లభ్యత 28.78 కిలోలుగా నమోదైంది. దేశ సగటు 7.50 కిలోలతో పోలిస్తే ఇది దాదాపు నాలుగు రెట్లు ఎక్కువ. 2018–19లో తెలంగాణలో తలసరి మాంసం లభ్యత 20.40 కిలోలుగా ఉండగా, 2023–24లో 29.21 కిలోలకు చేరింది. తాజా ఏడాదిలో స్వల్పంగా తగ్గి 28.78 కిలోలుగా నమోదైంది. అయినప్పటికీ దేశంలోని ఇతర రాష్ట్రాల కంటే తెలంగాణ ముందంజలో ఉంది. హర్యానా 23.87 కిలోలు, ఆంధ్రప్రదేశ్ 21.33 కిలోలు, మేఘాలయ 17.25 కిలోలు, కేరళ 14.55 కిలోలతో తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. రాష్ట్రంలో మాంసం ఉత్పత్తి కూడా గణనీయంగా పెరిగింది. 2018–19లో 7.54 లక్షల టన్నులుగా ఉన్న ఉత్పత్తి 2024–25 నాటికి 11.01 లక్షల టన్నులకు చేరింది. గొర్రెలు, మేకల పెంపకం, కోళ్ల పరిశ్రమ విస్తరణతో ఈ రంగం అభివృద్ధి చెందుతోంది. గ్రామీణ ప్రాంతాల్లో పశుపోషణ అనేక కుటుంబాలకు ఉపాధి, ఆదాయ వనరుగా మారింది. మరోవైపు హైదరాబాద్ సహా పట్టణ ప్రాంతాల్లో చికెన్, మటన్ విక్రయ కేంద్రాలు, రెస్టారెంట్లు, ఆన్‌లైన్ ఆహార సేవల ద్వారా మాంసాహార మార్కెట్ విస్తరిస్తోంది. అయితే తలసరి మాంసం లభ్యత అంటే ప్రతి వ్యక్తి వాస్తవంగా అంతే పరిమాణంలో మాంసం తింటున్నారని కాదు. రాష్ట్రంలో ఉత్పత్తి, జనాభా ఆధారంగా లెక్కించిన అంచనా మాత్రమే. ఇతర ప్రాంతాలకు సరఫరా, నిల్వలు, రవాణా, వినియోగంలో ఉండే తేడాలనూ పరిగణనలోకి తీసుకోవాలి. అయినప్పటికీ తెలంగాణలో మాంసం రంగం విస్తృతి, మాంసాహారానికి ఉన్న ఆదరణను ఈ గణాంకాలు తెలియజేస్తున్నాయి.

ప్రొటీన్లకు మంచి వనరు

మాంసాహారం శరీరానికి అవసరమైన అనేక పోషకాలను అందిస్తుంది. ముఖ్యంగా ప్రొటీన్లు, ఐరన్, విటమిన్ బి12, జింక్, సెలీనియం వంటి పోషకాలు ఇందులో ఉంటాయి. శరీర కండరాల నిర్మాణం, కణజాలాల మరమ్మతు, రోగనిరోధక వ్యవస్థ పనితీరుకు ప్రొటీన్లు అవసరం. మాంసంలో ఉండే ప్రొటీన్లలో శరీరానికి అవసరమైన తొమ్మిది రకాల అమైనో ఆమ్లాలు లభిస్తాయి. అందువల్ల ఎదుగుతున్న పిల్లలు, శారీరక శ్రమ ఎక్కువగా చేసే వారు, క్రీడాకారులకు తగిన ప్రొటీన్లు అందడం ముఖ్యం. మాంసంలో ఉండే హీమ్ ఐరన్‌ను శరీరం సులభంగా గ్రహిస్తుంది. రక్తంలో హిమోగ్లోబిన్ తయారీకి ఐరన్ అవసరం. దీని లోపం వల్ల రక్తహీనత సమస్య తలెత్తుతుంది. విటమిన్ బి12 ఎర్ర రక్తకణాల తయారీకి, నాడీ వ్యవస్థ సక్రమంగా పనిచేయడానికి ఉపయోగపడుతుంది. మాంసాహారం ద్వారా ఈ పోషకాలను పొందవచ్చు. అయితే మాంసం ఒక్కటే అన్ని పోషకాలకు ప్రత్యామ్నాయం కాదు. ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, పప్పుధాన్యాలు, చిరుధాన్యాలు, పాలు వంటి పదార్థాలనూ ఆహారంలో భాగం చేసుకోవాలి.

మటన్.. చికెన్.. చేపలు.. దేనిలో ఏముంది?

మటన్, చికెన్, చేపలు అన్నింటిలోనూ ప్రొటీన్లు ఉంటాయి. అయితే వాటి పోషక విలువలు, కొవ్వు శాతంలో తేడాలుంటాయి. గొర్రె, మేక మాంసంలో ప్రొటీన్లతోపాటు ఐరన్, విటమిన్ బి12 అధికంగా లభిస్తాయి. అదే సమయంలో కొన్ని భాగాల్లో సంతృప్త కొవ్వు ఎక్కువగా ఉంటుంది. చికెన్‌లో చర్మాన్ని తొలగించి, కొవ్వు తక్కువగా ఉండే భాగాన్ని తీసుకుంటే ప్రొటీన్లు ఎక్కువగా, కొవ్వు తక్కువగా పొందవచ్చు. చేపల్లో ప్రొటీన్లతోపాటు ఒమేగా–3 కొవ్వు ఆమ్లాలు ఉంటాయి. ముఖ్యంగా కొవ్వు చేపలు గుండె ఆరోగ్యానికి మేలు చేస్తాయి. మాంసం రకాన్ని ఎంచుకోవడంతో పాటు దాని పరిమాణం, వండే విధానానికీ ప్రాధాన్యం ఇవ్వాలి. నూనెలో ఎక్కువసేపు వేయించిన చికెన్, అధిక కొవ్వుతో తయారుచేసిన మటన్ వంటకాలు తరచూ తీసుకోవడం మంచిది కాదు. ఉడికించిన, తక్కువ నూనెతో తయారుచేసిన వంటకాలకు ప్రాధాన్యం ఇవ్వడం ఉత్తమం.

అతిగా తింటే గుండెజబ్బుల ముప్పు

మాంసాహారం పోషకాలను అందించినప్పటికీ అతిగా తీసుకోవడం వల్ల అనారోగ్య సమస్యలు తలెత్తవచ్చు. ముఖ్యంగా కొవ్వు ఎక్కువగా ఉండే మాంసం, నూనెలో వేయించిన వంటకాలు, అధిక ఉప్పుతో తయారుచేసిన పదార్థాలను తరచూ తినడం వల్ల శరీరంలో అదనపు కేలరీలు చేరతాయి. ఫలితంగా బరువు పెరగడం, ఊబకాయం, కొలెస్ట్రాల్ సమస్యలు, గుండెజబ్బుల ముప్పు పెరిగే అవకాశముంది. అధికంగా ఎర్ర మాంసం తీసుకోవడం టైప్–2 మధుమేహం వంటి ఆరోగ్య సమస్యలతోనూ సంబంధం కలిగి ఉందని పలు పరిశోధనలు వెల్లడిస్తున్నాయి. గొర్రె, మేక, పంది, గొడ్డు మాంసాలను ఎర్ర మాంసంగా పరిగణిస్తారు. వీటిని అధికంగా తీసుకోవడం వల్ల పేగు క్యాన్సర్ ముప్పు పెరిగే అవకాశం ఉందని ప్రపంచ ఆరోగ్య సంస్థకు చెందిన అంతర్జాతీయ క్యాన్సర్ పరిశోధనా సంస్థ పేర్కొంది. ముఖ్యంగా సాసేజీలు, బేకన్, హామ్ వంటి ప్రాసెన్ చేసిన మాంస పదార్థాలను క్యాన్సర్ కారకాలుగా వర్గీకరించింది. ఎర్ర మాంసాన్ని క్యాన్సర్ వచ్చే అవకాశాన్ని పెంచగల పదార్థంగా పేర్కొంది. అయితే మాంసం తిన్న ప్రతి ఒక్కరికీ క్యాన్సర్ వస్తుందని దీని అర్థం కాదు. తీసుకునే పరిమాణం, తరచుదనం, జీవనశైలి వంటి అంశాలూ ప్రభావం చూపుతాయి.

వండే పద్ధతిలోనూ జాగ్రత్తలు

మాంసం ఎంత తింటున్నామన్నదే కాకుండా ఎలా వండుతున్నామన్నదీ ఆరోగ్యంపై ప్రభావం చూపుతుంది. అధిక ఉష్ణోగ్రతలో నేరుగా మంటపై కాల్చడం, బొగ్గులపై ఎక్కువసేపు వేయించడం, మాంసం మాడిపోయేలా వండడం వల్ల కొన్ని హానికర రసాయనాలు ఏర్పడతాయి. చికెన్, మటన్ వంటకాల్లో నూనె, నెయ్యి, వెన్న, ఉప్పు ఎక్కువగా వాడటం వల్ల అదనపు కొవ్వు, సోడియం శరీరంలోకి చేరతాయి. మాంసాన్ని పూర్తిగా ఉడికించి తినడం చాలా ముఖ్యం. సరిగా ఉడకని మాంసం, పరిశుభ్రత లేని విక్రయ కేంద్రాల నుంచి కొనుగోలు చేసిన మాంసం ద్వారా బ్యాక్టీరియా, పరాన్నజీవుల ఇన్ఫెక్షన్లు వచ్చే ప్రమాదం ఉంది. మాంసం కొనుగోలు చేసేటప్పుడు తాజాదనం, పరిశుభ్రతను పరిశీలించాలి. పచ్చి మాంసాన్ని ఇతర ఆహార పదార్థాలకు దూరంగా ఉంచాలి. వండిన మాంసాన్ని ఎక్కువసేపు బయట ఉంచకుండా సరైన ఉష్ణోగ్రతలో నిల్వ చేయాలి.

మితమే మేలు.. సమతుల ఆహారమే ఆరోగ్యం

మాంసాహారం తీసుకోవడం మంచిదా? శాఖాహారం మంచిదా? అనే చర్చ కంటే శరీరానికి అవసరమైన పోషకాలు సరైన మోతాదులో అందుతున్నాయా? అనేదే ముఖ్యం. వయసు, శారీరక శ్రమ, బరువు, ఆరోగ్య పరిస్థితులను బట్టి ఆహార అవసరాలు మారుతాయి. గుండెజబ్బులు, అధిక కొలెస్ట్రాల్, మధుమేహం వంటి సమస్యలు ఉన్నవారు మాంసం రకం, పరిమాణం విషయంలో వైద్యులు లేదా పోషకాహార నిపుణుల సలహా తీసుకోవాలి. భారత వైద్య పరిశోధనా మండలి (ఐసీఎంఆర్), జాతీయ పోషకాహార సంస్థ (ఎన్ఐఎన్) విడుదల చేసిన 2024 ఆహార మార్గదర్శకాలు సమతుల ఆహారానికి ప్రాధాన్యం ఇస్తున్నాయి. పప్పులు, గుడ్లు, చేపలు, మాంసం వంటి ప్రొటీన్ల వనరులతోపాటు కూరగాయలు, పండ్లు, చిరుధాన్యాలు, ఇతర పోషక పదార్థాలనూ ఆహారంలో చేర్చుకోవాలని సూచిస్తున్నాయి. మాంసాహారం శరీరానికి మేలు చేసే పోషకాలను అందించే ఆహారమే. అయితే రుచికి ప్రాధాన్యమిస్తూ ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయకూడదు. మాంసం రకం, పరిమాణం, వండే పద్ధతిపై అవగాహనతో వ్యవహరించాలి. అతిగా కాకుండా మితంగా, పరిశుభ్రంగా, సమతుల ఆహారంలో భాగంగా తీసుకుంటేనే మాంసాహారం ప్రయోజనకరంగా ఉంటుంది.



6

దేశంలో మాంసం ఉత్పత్తి క్రమంగా పెరుగుతోంది. కేంద్ర మత్స్య, పశుసంవర్ధక, పాడిపరిశ్రమల మంత్రిత్వ శాఖ విడుదల చేసిన 'బేసిక్ యానిమల్ హస్బెండ్రీ స్టాటిస్టిక్స్–2025' నివేదిక ప్రకారం 2024–25లో దేశవ్యాప్తంగా 1.05 కోట్ల టన్నుల మాంసం ఉత్పత్తి జరిగింది. అంతకుముందు ఏడాదితో పోలిస్తే 2.46 శాతం వృద్ధి నమోదైంది. ప్రపంచంలో మాంసం ఉత్పత్తి చేసే దేశాల్లో భారత్ నాలుగో స్థానంలో ఉంది. దేశంలో ఉత్పత్తవుతున్న మాంసంలో కోళ్ల మాంసం వాటానే అత్యధికం. 51.8 లక్షల టన్నుల కోళ్ల మాంసం ఉత్పత్తి కాగా, ఇది మొత్తం ఉత్పత్తిలో దాదాపు నగం. మిగిలిన ఉత్పత్తిలో గేదె, గొర్రె, మేక, పంది తదితర జంతువుల మాంసం వాటా ఉంది. మాంసం ఉత్పత్తిలో పశ్చిమబెంగాల్ 12.46 శాతం వాటాతో మొదటి స్థానంలో ఉంది. ఉత్తరప్రదేశ్ 12.20 శాతం, మహారాష్ట్ర 11.57 శాతం, ఆంధ్రప్రదేశ్ 10.84 శాతం, తెలంగాణ 10.49 శాతంతో తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. ఈ ఐదు రాష్ట్రాలు కలిపి దేశ మాంసం ఉత్పత్తిలో 57.55 శాతం వాటా కలిగి ఉన్నాయి. దేశవ్యాప్తంగా కోళ్ల పెంపకం, గొర్రెలు, మేకల పెంపకం, ఇతర పశుసంపద ఆధారిత కార్యకలాపాలు మాంసం ఉత్పత్తి పెరుగుదలకు దోహదపడుతున్నాయి.



సీత పాత్ర.. నాలో వ్యక్తిగత మార్పులు తెచ్చింది

దర్శకుడు నితీశ్ తివారీ తెరకెక్కిస్తున్న 'రామాయణ' చిత్రంలో సీత పాత్ర పోషించడం తన జీవితంలో ఎంతో ప్రత్యేకమైన అనుభవమని ప్రముఖ నటి సాయిపల్లవి తెలిపారు. ఈ పాత్ర తనలో వ్యక్తిగతంగా కొన్ని మార్పులకు కారణమైందని వెల్లడించారు. ప్రముఖ జర్నలిస్ట్ బర్ఖా దత్ నిర్వహించిన 'వి ది ఉమెన్' కార్యక్రమంలో పాల్గొన్న ఆమె.. సీత పాత్రతో తనకు కలిగిన అనుభవాలు, సోషల్ మీడియాలో వస్తున్న విమర్శలపై స్పందించారు. తన జీవితంలో సినిమాలు, పాత్రలు నిరంతరం కొత్త అనుభవాలను అందిస్తుంటాయని సాయిపల్లవి పేర్కొన్నారు. ''నా జీవితం ఒక సినిమా నుంచి మరో సినిమాకు సాగుతూనే ఉంటుంది. ప్రతి పాత్ర నుంచి మనం ఏదో ఒకటి నేర్చుకుంటాం. సీత పాత్ర కూడా నాలో కొన్ని వ్యక్తిగత మార్పులకు కారణమైంది. అయితే, వాటి గురించి ప్రపంచానికి చెప్పాల్సిన అవసరం లేదు. ప్రతి ఒక్కరూ వాటిని అర్థం చేసుకోవాల్సిన అవసరం కూడా లేదు'' అని అన్నారు.

విమర్శలను అభిప్రాయాలుగానే చూడాలి

సీత పాత్ర లుక్‌పై సోషల్ మీడియాలో వస్తున్న విమర్శల గురించి మాట్లాడుతూ.. వాటిని తాను గమనిస్తూనే ఉంటానని స్పష్టం చేశారు. 'సోషల్ మీడియాలో ఏం జరుగుతుందో నాకు తెలియదని అనుకోవద్దు. సీతమ్మ పాత్రపై వస్తున్న విమర్శలు నా దృష్టికి వస్తుంటాయి. ప్రతి ఒక్కరికీ వారి అభిప్రాయాలు ఉంటాయి. వాటిని అభిప్రాయాలుగానే చూడాలి. వాటిని ఎదుర్కొంటూ మరింత బలంగా మారాలి. ధైర్యాన్ని పెంచుకోవాలి. అప్పుడే ప్రపంచాన్ని ఎదుర్కోగలం. విమర్శలను పట్టించుకోకుండా ముందుకు సాగగలం' అని వివరించారు.

అందానికే పరిమితమయ్యే పాత్రలు ఇష్టం లేదు

కేవలం అందానికి ప్రాధాన్యం ఇచ్చే పాత్రల్లో నటించడం తనకు ఇష్టం లేదని సాయిపల్లవి పేర్కొన్నారు. అలాంటి పాత్రలను తాను ఎంచుకోనని స్పష్టం చేశారు. బాహ్య విమర్శలు మన అంతరంగాన్ని ప్రభావితం చేయకుండా చూసుకోవాలని, లోపల బలంగా ఉన్నప్పుడే అనవసరమైన మాటలను పక్కనపెట్టి మన ప్రయాణంలో ముందుకు సాగగలమని ఆమె అభిప్రాయపడ్డారు.





నితిన్‌కు ఇదే బెస్ట్ కమ్‌బ్యాక్

- 'అలియాస్ రుక్మిణి' సినిమా నచ్చకపోతే సినిమాలు తీయడం మానేస్తా: నాని

హీరో నితిన్ కెరీర్‌లో 'అలియాస్ రుక్మిణి' అత్యంత అందమైన కమ్‌బ్యాక్‌గా నిలుస్తుందని నేచురల్ స్టార్ నాని ధీమా వ్యక్తం చేశారు. ఈ సినిమా ప్రేక్షకులకు అద్భుతమైన, మనసుకు హత్తుకునే అనుభూతిని అందిస్తుందని చెప్పారు. సినిమా నచ్చకపోతే తాను సినిమాలు తీయడం మానేస్తానంటూ ప్రీ రిలీజ్ వేడుకలో యాంకర్ సుమతో కలిసి సరదాగా శపథం చేశారు. నాని సమర్పణలో నితిన్, ఆఫియా సయ్యద్ జంటగా నటించిన ఈ చిత్రానికి మురళీకాంత్ దేవసోత్ దర్శకత్వం వహించగా, దీప్తి ఘంటా నిర్మించారు. సినిమా అనుకున్నదానికంటే ఎంతో అందంగా వచ్చిందని నాని అన్నారు. ఫలితం గురించి ఆందోళన కంటే, తమ చేతిలో మంచి సినిమా ఉందన్న సంతృప్తి ఎక్కువగా ఉందని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్ట్‌తో ముందుగా కథ అనుసంధానమైంది, ఆ తర్వాతే తామంతా భాగస్వాములయ్యామని చెప్పారు. నిర్మాతగా వ్యవహరించడం తన అదృష్టమన్నారు. ఒక సాధారణ ప్రేక్షకుడిగా సినిమా చూసినా, చిత్రబృందానికి ఫోన్ చేసి ప్రచార కార్యక్రమాల్లో తనను భాగం చేయాలని కోరేవాడినని తెలిపారు.

నితిన్ నటనకు ఫిదా

నితిన్‌తో తనకు 21 ఏళ్లుగా పరిచయం ఉందని, అయితే ఈ సినిమాలో ఆయన నటన తనను ఆశ్చర్యపరిచిందని నాని ప్రశంసించారు. పాత్రలోని భావోద్వేగాలను, సూక్ష్మమైన మార్పులను ఎంతో పరిణతితో పలికించాడన్నారు. ఈ ఏడాది ఎన్నో కమ్‌బ్యాక్‌లు చూశామని, డిసెంబరు 4న నితిన్ కెరీర్‌లోనే అత్యంత అందమైన కమ్‌బ్యాక్ చూడబోతున్నామని వ్యాఖ్యానించారు. ముఖ్యంగా ట్రైలర్‌లో సన్నివేశంతో పాటు, ముఖంలో ఎలాంటి కదలిక లేకుండా కళ్లతోనే భావాలను పలికించిన తీరు ప్రేక్షకులను ఆకట్టుకుంటుందని చెప్పారు. కథానాయిక ఆఫియా సయ్యద్ తన నటనతో సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచిందని కొనియాడారు.

ప్రతి ఒక్కరి కష్టం తెరపై కనిపిస్తుంది

దర్శకుడు మురళీకాంత్ కథను సహజంగా, బలంగా తీర్చిదిద్దారని నాని తెలిపారు. సినిమాటోగ్రాఫర్ జోమన్ టి. జాన్ అందించిన విజువల్స్, విజయ్ బుల్గానిన్ స్వరపరిచిన మెలోడీ పాటలు, నేపథ్య సంగీతం చిత్రానికి ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయని చెప్పారు. ఎడిటర్ సృజన, కళా దర్శకుడు అవినాష్ కొల్లా, కాస్ట్యూమ్ డిజైనర్ రేఖ తమ విభాగాల్లో చక్కటి పనితీరు కనబరిచారని ప్రశంసించారు. తన సోదరి, నిర్మాత దీప్తి ఘంటా ఈ ప్రాజెక్ట్‌ను విజయవంతంగా ముందుకు తీసుకెళ్లడంలో తనకు అండగా నిలిచారని సంతోషం వ్యక్తం చేశారు.

కుటుంబమంతా కలిసి చూడదగ్గ చిత్రం

సోషల్ మీడియాలో నెగెటివిటీ, విద్వేషం పెరుగుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో స్వచ్ఛమైన ప్రేమ, అనుబంధాలను చాటిచెప్పే చిత్రంగా 'అలియాస్ రుక్మిణి'ని నాని అభివర్ణించారు. భార్యాభర్తలు, కుటుంబ సభ్యులు, పదేళ్లు పైబడిన పిల్లలు కలిసి థియేటర్లలో చూడదగ్గ సినిమా అని చెప్పారు. డిసెంబరు 3 రాత్రి నుంచే తెలుగు రాష్ట్రాల్లో విస్తృతంగా ప్రీమియర్ ప్రదర్శనలు ఉంటాయని, 4న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదలవుతుందన్నారు.



డా.రెడ్డీస్ ప్లాంట్ లైసెన్స్ రెండు రోజులు సస్పెండ్

- శ్రీకాకుళం యూనిట్‌పై ఔషధ నియంత్రణ శాఖ చర్యలు

న్యూఢిల్లీ: ప్రముఖ ఔషధ తయారీ సంస్థ డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్‌కు ఆంధ్రప్రదేశ్‌లోని తయారీ కేంద్రంలో ఎదురుదెబ్బ తగిలింది. శ్రీకాకుళం జిల్లాలోని దేవునిపాలవలస గ్రామంలో ఉన్న సీటీఓ–సెజ్ ప్రాసెస్ యూనిట్–01 తయారీ లైసెన్స్‌ను రెండు రోజుల పాటు సస్పెండ్ చేస్తూ రాష్ట్ర ఔషధ నియంత్రణ శాఖ ఆదేశాలు జారీ చేసింది. ఈ విషయాన్ని సంస్థ శనివారం స్టాక్ ఎక్స్ఛేంజీలకు సమర్పించిన నివేదికలో వెల్లడించింది. 2026 జూన్‌లో ఈ యూనిట్‌ను అధికారులు తనిఖీ చేశారు. ఆ సందర్భంగా కొన్ని అంశాలపై అభ్యంతరాలు వ్యక్తం చేశారు. వాటిపై సంస్థ వివరణలు, సమాధానాలు సమర్పించినప్పటికీ అధికారులు సంతృప్తి చెందలేదు. దీంతో లైసెన్స్ సస్పెన్షన్‌కు ఆదేశించినట్లు కంపెనీ తెలిపింది. ఆంధ్రప్రదేశ్ డ్రగ్స్ అండ్ కాస్మెటిక్స్ డైరెక్టర్ జనరల్ కార్యాలయం నుంచి సవంబరు 24 తేదీతో జారీ అయిన ఉత్తర్వులు శుక్రవారం అందినట్లు పేర్కొంది. విజయవాడ డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ (ఎఫ్ఏసీ), లైసెన్సింగ్ అథారిటీ ఈ ఆదేశాలు జారీ చేసినట్లు వెల్లడించింది. లైసెన్స్ సస్పెన్షన్ నిర్ణయం వల్ల తమ ఆర్థిక పరిస్థితి, కార్యకలాపాలు లేదా ఇతర వ్యాపారాలపై గణనీయమైన ప్రభావం ఉండబోదని డాక్టర్ రెడ్డీస్ అంచనా వేసింది. ఈ ఉత్తర్వులపై తగిన నియంత్రణపరమైన, సరిదిద్దే చర్యలను పరిశీలిస్తున్నట్లు తెలిపింది. ఉత్తర్వులపై పునఃసమీక్ష కోరుతూ అప్పీల్ దాఖలు చేసే అంశాన్నీ పరిశీలిస్తున్నట్లు పేర్కొంది.

నష్టాల సుడిలోనూ దూకుడు

- ఎయిరిండియాకు రూ.22 వేల కోట్లకు పైగా నష్టాలు.. అయినా సంస్కరణల్లో వెనక్కి తగ్గని సంస్థ
- పాక్ గగనతల ఆంక్షలు, ఇంధన ధరల పెరుగుదలతో భారీ భారం
- 600 విమానాల కొనుగోలుకు ఆర్డర్లు.. 100కుపైగా ఆధునికీకరణ
- సంస్థను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లడమే లక్ష్యం: ఎయిరిండియా స్వతంత్ర డైరెక్టర్ సంజీవ్ మెహతా



ముంబై: భారీ నష్టాలు ఎదురైనా ఎయిరిండియాను అంతర్జాతీయ స్థాయి విమానయాన సంస్థగా తీర్చిదిద్దే లక్ష్యంతో చేపట్టిన మార్పుల ప్రక్రియను కొనసాగిస్తామని సంస్థ బోర్డు స్పష్టం చేసింది. రూ.22 వేల కోట్లకు పైగా నష్టాలు వచ్చినప్పటికీ అభివృద్ధి ప్రణాళికల అమలులో వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని ఎయిరిండియా స్వతంత్ర డైరెక్టర్ సంజీవ్ మెహతా తెలిపారు. పాక్ గగనతలాన్ని భారత విమానాలకు మూసివేయడం, విమాన ఇంధన ధరలు భారీగా పెరగడం వంటి సంస్థ నియంత్రణలో లేని పరిణామాలు నష్టాలకు ప్రధాన కారణమయ్యాయని వివరించారు. శనివారం ముంబయిలో జేఆర్‌డీ టాటా మెమోరియల్ ట్రస్ట్ నిర్వహించిన ఎయిరిండియా వ్యవస్థాపకుడు జేఆర్‌డీ టాటా 122వ జయంతి వేడుకల్లో ఆయన మాట్లాడారు. 2026 మార్చితో ముగిసిన ఆర్థిక సంవత్సరంలో ఎయిరిండియాకు రూ.22 వేల కోట్లకు పైగా నష్టం వచ్చిందని మెహతా వెల్లడించారు. ఇంతటి భారీ నష్టాలపై సమీక్ష జరగడం, ప్రశ్నలు తలెత్తడం సహజమేనని పేర్కొన్నారు. బోర్డు పారదర్శకమైన సమీక్షను స్వాగతిస్తుందని, అయితే ఆ ఆర్థిక సంవత్సరంలో సంస్థ ఎదుర్కొన్న అసాధారణ పరిస్థితులను కూడా పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు.

మూడు పరిణామాలతో భారీ దెబ్బ

ఎయిరిండియా విమానం ఏఐ 171 ప్రమాదం, భారత విమానాలకు పాకిస్థాన్ గగనతలాన్ని మూసివేయడం, ఇరాన్–అమెరికా యుద్ధం కారణంగా విమాన ఇంధన ధరలు పెరగడం.. ఈ మూడు పరిణామాలు సంస్థ ఆర్థిక పరిస్థితిపై తీవ్ర ప్రభావం చూపాయని మెహతా వివరించారు. పాక్ గగనతలం మీదుగా ప్రయాణించే అవకాశం లేకపోవడంతో కొన్ని మార్గాల్లో విమానాలు అదనపు దూరం ప్రయాణించాల్సి వస్తోందన్నారు. దీనివల్ల ఇంధన వినియోగంతో పాటు విమానాల నిర్వహణ భారం కూడా పెరిగిందని చెప్పారు. పాశ్చాత్య దేశాల పోటీ విమానయాన సంస్థలకు ఇదే స్థాయిలో ఈ అదనపు భారం లేదని పేర్కొన్నారు. ఇరాన్ యుద్ధం తర్వాత చమురు ధరలు అనూహ్యంగా పెరగడం ఎయిరిండియాపై మరింత ఒత్తిడి పెంచిందన్నారు. ఇప్పటికే సంస్థలో మార్పులు, నిర్వహణకు భారీగా ఖర్చు చేస్తున్న తరుణంలో ఈ పరిణామాలు ఎదురయ్యాయని తెలిపారు. ఇవి సాధారణ వ్యాపార ఒడుదొడుకులు కావని, ఒకేసారి ఎదురైన బాహ్య సవాళ్లని పేర్కొన్నారు. అయితే వాటిని సాకుగా చూపి సంస్థలో సంస్కరణలు, అభివృద్ధి కార్యక్రమాలను నిలిపివేయబోమని స్పష్టం చేశారు.

మూడు అంశాలే ప్రాతిపదిక

ఎయిరిండియా రూపాంతర ప్రక్రియ మూడు ప్రధాన అంశాలపై ఆధారపడి ఉందని మెహతా తెలిపారు. సంస్థలో పని సంస్కృతిని మెరుగుపరచడం, ప్రత్యేక సామర్థ్యాలను అభివృద్ధి చేయడం, అధిక పనితీరు కనబరిచే వ్యవస్థను నిర్మించడం వాటిలో ముఖ్యమైనవని వివరించారు. విమానయాన రంగంలో విమానాల సముదాయం, ప్రయాణికులకు అందించే సేవలు అత్యంత కీలకమని చెప్పారు. ఈ లక్ష్యంలో భాగంగా దాదాపు 600 విమానాల కొనుగోలుకు ఆర్డర్లు ఇచ్చామని, 100కుపైగా విమానాలను ఆధునికీకరించే కార్యక్రమం చేపట్టామని వెల్లడించారు. అంతర్జాతీయ విమానయాన సంస్థలతో పోటీపడేలా ఆధునిక, తక్కువ ఇంధనాన్ని వినియోగించే విమానాలతో కూడిన సముదాయాన్ని నిర్మించడమే లక్ష్యమని తెలిపారు. సంస్థలో మెరుగైన పాలన, సమర్థ నిర్వహణ పద్ధతులు, ఖర్చుల నియంత్రణ, సమర్థ నాయకత్వం సమన్వయంతో పనిచేయాల్సి ఉంటుందని మెహతా అభిప్రాయపడ్డారు. అభివృద్ధి దశ నుంచి దీర్ఘకాలికంగా మెరుగైన పనితీరు సాధించే స్థాయికి చేరే క్రమంలో సంస్థ నిర్వహణ వ్యవస్థ మారుతూ ఉండాలని పేర్కొన్నారు.

కొత్త సీఈఓపై ఆశలు

ఎయిరిండియా కొత్త సీఈఓ, మేనేజింగ్ డైరెక్టర్ టెలోల్ గెబ్రెమారియంపై బోర్డుకు పూర్తి విశ్వాసం ఉందని మెహతా తెలిపారు. ఇథియోపియన్ ఎయిర్‌లైన్స్‌కు దశాబ్దానికి పైగా నాయకత్వం వహించిన ఆయనకు అంతర్జాతీయ విమానయాన రంగంలో విస్తృత అనుభవం ఉందన్నారు. క్రమశిక్షణ, ఖర్చుల సామర్థ్యం వాణిజ్యపరమైన అమలుపై ఆయనకు స్పష్టమైన అవగాహన ఉందని పేర్కొన్నారు.

ట్రస్టుల పిటిషన్లపై టాటా సన్స్ ముందస్తు జాగ్రత్త

- బాంబే హైకోర్టు, సుప్రీంకోర్టులో కేవియట్లు దాఖలు
- ట్రస్టుల అప్పీళ్లపై తమ వాదన వినాలంటూ పిటిషన్లు
- చంద్రశేఖరన్ మూడోసారి నియామకంపై వివాదం

ముంబై: టాటా ట్రస్టులు న్యాయస్థానాల్లో అప్పీల్ దాఖలు చేస్తే తమ వాదనలు వినకుండా ఎలాంటి ఉత్తర్వులు జారీ చేయకుండా ఉండేందుకు టాటా సన్స్ ముందస్తు చర్యలు చేపట్టింది. ఈ మేరకు శనివారం బాంబే హైకోర్టు, సుప్రీంకోర్టుల్లో కేవియట్లు దాఖలు చేసింది. టాటా సన్స్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్‌గా ఎన్. చంద్రశేఖరన్‌ను మూడోసారి నియమించడాన్ని సవాలు చేస్తూ సర్ దొరాబ్జీ టాటా ట్రస్ట్, ఆర్‌డీ టాటా ట్రస్ట్ దాఖలు చేసిన పిటిషన్లపై శుక్రవారం బాంబే హైకోర్టు తక్షణ ఊరట ఇచ్చేందుకు నిరాకరించిన నేపథ్యంలో ఈ పరిణామం చోటుచేసుకుంది. సవంబరు 30న జరగనున్న టాటా సన్స్ బోర్డు సమావేశాన్ని వాయిదా వేయాలని లేదా ఆ సమావేశంలో చైర్మన్ చంద్రశేఖరన్ తన నిర్ణయాత్మక ఓటు (కాస్టింగ్ ఓటు) వినియోగించకుండా ఆదేశాలు ఇవ్వాలని రెండు ట్రస్టులు హైకోర్టును కోరాయి. అయితే సమావేశాన్ని వాయిదా వేయడం లేదా దానిపై స్టే విధించడం సాధ్యం కాదని జస్టిస్ అభయ్ అహూజా నేతృత్వంలోని ధర్మాసనం స్పష్టం చేసింది. షెడ్యూల్ ప్రకారమే సమావేశం నిర్వహించుకోవచ్చని, అయితే అది తుది న్యాయస్థాన ఉత్తర్వులకు లోబడి ఉంటుందని పేర్కొంది.

జనవరి 18కి తదుపరి విచారణ

టాటా సన్స్, కేసులోని ఇతర ప్రతివాదులు, ఆరుగురు డైరెక్టర్లు తమ సమాధాన అఫిడవిట్లు దాఖలు చేయాలని ధర్మాసనం ఆదేశించింది. సవంబరు 26న దాఖలైన రెండు పిటిషన్లపై తదుపరి విచారణను 2027 జనవరి 18కి వాయిదా వేసింది. హైకోర్టు నుంచి తక్షణ ఊరట లభించకపోవడంతో ట్రస్టులు సుప్రీంకోర్టును ఆశ్రయించే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలోనే టాటా సన్స్ కేవియట్లు దాఖలు చేసినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. చంద్రశేఖరన్‌ను మరో ఐదేళ్ల పదవీకాలానికి ఎగ్జిక్యూటివ్ చైర్మన్‌గా తిరిగి నియమిస్తూ సెప్టెంబరు 17న టాటా సన్స్ బోర్డు తీసుకున్న నిర్ణయం చెల్లదని రెండు ట్రస్టులు తమ పిటిషన్లలో పేర్కొన్నాయి. కంపెనీ ఆర్టికల్స్ ఆఫ్ అసోసియేషన్‌లోని ఆర్టికల్ 121 ప్రకారం అవసరమైన అనుకూల ఓటు లభించకుండానే తీర్మానం ఆమోదించారని ఆరోపించాయి. టాటా సన్స్ నుంచి సర్ దొరాబ్జీ టాటా ట్రస్ట్ రూ.50 కోట్లు, ఆర్‌డీ టాటా ట్రస్ట్ రూ.15 కోట్ల నష్టపరిహారంతోపాటు ఏటా 18 శాతం వడ్డీ చెల్లించాలని డిమాండ్ చేశాయి. టాటా ట్రస్టుల తరఫున నామినేట్ అయిన డైరెక్టర్ల మధ్య అభిప్రాయభేదాలు ఏర్పడి ఓట్లు సమానమైతే చంద్రశేఖరన్ కాస్టింగ్ ఓటు వినియోగించకుండా అడ్డుకోవాలని ట్రస్టులు కోరాయి.

ఐపీఓను నివారించే ప్రయత్నం



దేశంలోనే అతిపెద్ద వ్యాపార సమూహమైన టాటా గ్రూప్ హోల్డింగ్ కంపెనీ టాటా సన్స్‌లో టాటా ట్రస్టులకు 66 శాతం వాటా ఉంది. ట్రస్టుల చైర్మన్ నోయెల్ టాటా, చంద్రశేఖరన్ పునర్నియామకంతో పాటు టాటా సన్స్ స్టాక్ మార్కెట్‌లో నమోదయ్యే (ఐపీఓ) అంశంపైనా సంస్థతో విభేదిస్తున్నారు. టాటా సన్స్‌ను ఎన్‌బీఎఫ్‌సీ–అప్పర్ లేయర్ సంస్థగా వర్గీకరించిన ఆర్‌బీఐ, దాని లిస్టింగ్‌ను తప్పనిసరి చేసింది. ఐపీఓను నివారించేందుకు వ్యాపార నిర్మాణాన్ని పునర్వ్యవస్థీకరించాలని నోయెల్ ప్రయత్నిస్తున్నారు.

గుకేశ్–సిందరోవ్ హోరాహోరీ పోరు

- ప్రపంచ చెస్ చాంపియన్‌షిప్‌లో నాలుగో డ్రా
- 34 ఎత్తులకే ముగిసిన నాలుగో గేమ్
- 2–2తో స్కోరు సమం
- గుకేశ్ ఎత్తుగడకు సిందరోవ్ దీటైన జవాబు
- మరింత ఆసక్తిగా మారిన మిగిలిన గేమ్‌లు



జెనీవా: ప్రపంచ చెస్ చాంపియన్‌షిప్‌లో భారత గ్రాండ్‌మాస్టర్, డిఫెండింగ్ చాంపియన్ డి.గుకేశ్, ఉజ్బెకిస్థాన్ ఛాలెంజర్ జవోఖిర్ సిందరోవ్ మధ్య పోరు నువ్వా నేనా అన్నట్లు సాగుతోంది. వీరిద్దరి మధ్య శనివారం జరిగిన నాలుగో గేమ్ కూడా డ్రాగా ముగిసింది. తెల్ల పావులతో బరిలోకి దిగిన గుకేశ్ ప్రత్యర్థిపై ఒత్తిడి పెంచేందుకు కొత్త వ్యూహాలు అనుసరించినా.. సిందరోవ్ వాటిని సమర్థంగా తిప్పికొట్టాడు. 34 ఎత్తుల తర్వాత ఇద్దరూ డ్రాకు అంగీకరించారు. దీంతో 14 గేమ్‌ల టైటిల్ పోరులో స్కోరు 2–2తో సమంగా నిలిచింది. పెట్రోవ్ డిఫెన్స్‌తో ప్రారంభమైన ఈ గేమ్‌లో గుకేశ్ తొమ్మిదో ఎత్తులో క్వీన్‌తో కొత్త తరహా వ్యూహాన్ని ప్రయోగించి ప్రత్యర్థిని ఒత్తిడిలోకి నెట్టేందుకు ప్రయత్నించాడు. అయితే సిందరోవ్ ఆ ఎత్తును ముందుగానే అంచనా వేసి దీటుగా బదులిచ్చాడు. ఆ తర్వాత పావుల కదలికలతో దాడికి అవకాశాలు సృష్టించేందుకు గుకేశ్ ప్రయత్నించినా.. ఉజ్బెక్ ఆటగాడు ఎలాంటి పొరపాట్లకు తావివ్వలేదు. ఇద్దరూ తమ రూక్‌లను మార్చుకున్నాక ఆట క్వీన్ ఎండ్‌గేమ్ దశకు చేరింది. గుకేశ్ వరుసగా క్వీన్‌తో చెక్‌లు పెట్టినా ఫలితం లేకపోయింది. చివరకు ఎత్తుల పునరావృతంతో గేమ్ డ్రా అయ్యింది.

తొమ్మిదో ఎత్తు అద్భుతం

తొమ్మిదో ఎత్తులో తాను ప్రయోగించిన క్వీన్ వ్యూహం అద్భుతంగా ఉందని గుకేశ్ అభిప్రాయపడ్డాడు. ఇద్దరు బలమైన ఆటగాళ్లు అత్యుత్తమంగా ఆడినప్పుడు డ్రా ఫలితం సహజమేనని పేర్కొన్నాడు. సింగపూర్‌లో జరిగిన గత ప్రపంచ చాంపియన్‌షిప్‌తో పోలిస్తే ప్రస్తుత పోరులో ఇరు వైపులా సమాన స్థాయి ఆట కనిపిస్తోందని చెప్పాడు. గత పోటీలో హెచ్చుతగ్గులు ఉండేవని, ఈసారి మాత్రం ఇద్దరూ సమర్థంగా ఆడుతున్నారని వివరించాడు. ఇదిలా ఉంటే డ్రా ఫలితం సహజమేనని సిందరోవ్ పేర్కొన్నాడు. ఇద్దరూ అత్యుత్తమ స్థాయిలో ఆడినప్పుడు ఇలాంటి ఫలితమే వస్తుందని తెలిపాడు. మిగిలిన పది గేమ్‌లు ఆసక్తికరంగా సాగుతాయని ఆశాభావం వ్యక్తం చేశాడు.



ఆసియా చాంపియన్స్ ట్రోఫీ మనదే

- మూడోసారి టైటిల్‌ను ముద్దాడిన భారత మహిళల హాకీ జట్టు
- ఫైనల్లో చైనాపై 3–1తో ఘన విజయం
- 10 గోల్స్‌తో టోర్నీ టాపర్‌గా దీపిక

భోపాల్: భారత మహిళల హాకీ జట్టు ఆసియా చాంపియన్స్ ట్రోఫీపై మరోసారి తన ఆధిపత్యాన్ని చాటుకుంది. శనివారం జరిగిన ఫైనల్లో ఒలింపిక్స్, ఆసియా క్రీడల రజత పతక విజేత చైనాను 3–1 గోల్స్ తేడాతో ఓడించి వరుసగా మూడోసారి టైటిల్‌ను అందుకుంది. దీంతో ఈ టోర్నీలో భారత్ టైటిళ్ల సంఖ్య మూడుకు చేరింది. టోర్నీ ఆద్యంతం అజేయంగా నిలిచిన భారత జట్టు.. ఈ ఏడాది విజయ పరంపరను కొనసాగించింది. మ్యాచ్ ఆరంభం నుంచి చైనా గట్టి పోటీనిచ్చింది. తొలి రెండు క్వార్టర్లలో దూకుడుగా ఆడుతూ భారత రక్షణ శ్రేణిపై ఒత్తిడి పెంచింది. ఈ క్రమంలో 25వ నిమిషంలో చెన్ యుజున్ ఫీల్డ్ గోల్ సాధించి చైనాకు ఆధిక్యాన్ని అందించింది. దీంతో తొలి అర్ధభాగం ముగిసే సమయానికి భారత్ 0–1తో వెనుకబడింది. రెండో అర్ధభాగంలో భారత జట్టు ఆటతీరును పూర్తిగా మార్చింది. మూడో క్వార్టర్‌లో దూకుడు పెంచి చైనాపై ఒత్తిడి తీసుకొచ్చింది. 38వ నిమిషంలో లభించిన పెనాల్టీ కార్నర్‌ను దీపిక అద్భుతమైన ఫ్లిక్‌తో గోల్‌గా మలిచి స్కోరును 1–1తో సమం చేసింది. ఆరు నిమిషాలకే నేహా గోయల్, నవనీత్ కౌర్ అందించిన బంతిని ఇషికా గోల్‌గా మలిచి భారత్‌కు 2–1 ఆధిక్యాన్ని అందించింది. ఆ వెంటనే, 43వ నిమిషంలో లభించిన పెనాల్టీ కార్నర్‌ను దీపిక మరోసారి లక్ష్యానికి చేర్చింది. దీంతో భారత్ ఆధిక్యం 3–1కు పెరిగింది. ఆ తర్వాత చైనా గోల్ కోసం చేసిన ప్రయత్నాలను భారత రక్షణ శ్రేణి సమర్థంగా అడ్డుకుంది.

దీపికదే గోల్స్ హవా

టోర్నీ మొత్తం మీద దీపిక అద్భుత ప్రదర్శన కనబరిచింది. మొత్తం 10 గోల్స్ సాధించి అత్యధిక గోల్స్ చేసిన క్రీడాకారిణిగా నిలిచింది. వీటిలో తొమ్మిది పెనాల్టీ కార్నర్ల ద్వారా, ఒకటి ఫీల్డ్ గోల్ రూపంలో సాధించింది. గతంలో 2023లో రాంచీ, 2024లో రాజ్‌గిర్‌లో జరిగిన ఆసియా చాంపియన్స్ ట్రోఫీల్లోనూ భారత్ విజేతగా నిలిచింది. తాజాగా చైనాపై గెలుపుతో వరుసగా మూడోసారి టైటిల్ సాధించి హ్యాట్రిక్ నమోదు చేసింది. ఈ టోర్నీలో జపాన్‌పై 4–0తో విజయం సాధించిన అనంతరం నవంబరు 25న భారత మహిళల జట్టు ప్రపంచ ర్యాంకింగ్స్‌లో చారిత్రకంగా నాలుగో స్థానానికి చేరుకుంది. ఈ ఏడాది ఆసియా క్రీడల్లోనూ చైనాను 1–0తో ఓడించి 2028 ఒలింపిక్స్‌కు నేరుగా అర్హత సాధించింది. తాజాగా అదే ప్రత్యర్థిని ఫైనల్లో ఓడించి ఆసియా చాంపియన్స్ ట్రోఫీని మూడోసారి సొంతం చేసుకుంది.



టీమిండియా తడబ్యాటు

- రెండో టెస్టులో పట్టుబిగించిన కివీస్
- తొలి ఇన్నింగ్స్‌లో 116 పరుగులకే ఆరు వికెట్లు కోల్పోయిన భారత్
- డబ్ల్యూటీసీ ఫైనల్ ఆశలకు గండం



క్రైస్ట్‌చర్చ్: న్యూజిలాండ్‌తో రెండో టెస్టులో భారత జట్టు కష్టాల్లో పడింది. బ్యాటర్ల వైఫల్యానికి తోడు రిషభ్ పంత్ బాధ్యతారాహిత్య షాట్‌తో వికెట్ పారేసుకోవడంతో టీమిండియా చిక్కుల్లో పడింది. తొలి ఇన్నింగ్స్‌లో 356 పరుగులు చేసిన న్యూజిలాండ్‌కు బదులుగా రెండో రోజు ఆట ముగిసే సమయానికి భారత్ 116 పరుగులకే ఆరు వికెట్లు కోల్పోయింది. ఇంకా 240 పరుగుల వెనుకంజలో ఉంది. పేసర్లకు అనుకూలిస్తున్న హాగ్లీ ఓవల్ పిచ్‌పై భారత బ్యాటర్లు నిలదొక్కుకోలేకపోతున్నారు. దీంతో మ్యాచ్‌లో విజయం కంటే డ్రా కోసం పోరాడాల్సిన పరిస్థితి కనిపిస్తోంది. ఇదిలాఉంటే బాధ్యతగా ఆడాల్సిన సమయంలో టీమిండియా వికెట్ కీపర్ పంత్ (23) మరోసారి అనవసరపు దూకుడుకు వెళ్లాడు. జాకబ్ డఫీ బౌలింగ్‌లో క్రీజు వదిలి ముందుకొచ్చి భారీ షాట్ ఆడేందుకు ప్రయత్నించాడు. అయితే బంతి అదనపు బౌన్స్‌తో గాల్లోకి లేవడంతో కైల్ జేమీసన్ సులువుగా క్యాచ్ అందుకున్నాడు. అప్పటికే 38 బంతులు ఎదుర్కొని, ఒక సిక్సర్ బాదిన పంత్.. జట్టును ఆదుకోవాల్సిన సమయంలో వికెట్ సమర్పించుకున్నాడు. గతంలో గువాహటిలో దక్షిణాఫ్రికాతో జరిగిన టెస్టులో మార్కో యాన్సెన్ బౌలింగ్‌లోనూ ఇలాంటి షాట్‌తోనే పంత్ వికెట్ కోల్పోయాడు. అతడి షాట్ ఎంపికపై గతంలోనూ విమర్శలు చేసిన కోచ్ గౌతమ్ గంభీర్.. తాజా ప్రదర్శనతో అసంతృప్తికి గురయ్యే అవకాశం ఉంది. అంతకుముందు న్యూజిలాండ్ పేసర్ల బౌన్స్, స్వింగ్‌ను ఎదుర్కోవడంలో భారత బ్యాటర్లు ఇబ్బంది పడ్డారు. ఓపెనర్ యశస్వి జైస్వాల్ (0)ను మాట్ హెన్రీ అద్భుతమైన బంతితో పెవిలియన్‌కు పంపాడు. దేవదత్ పడిక్కల్ (21) జేమీసన్ బౌలింగ్‌లో దూకుడుగా ఆడుతూ చివరకు వికెట్ చేజార్చుకున్నాడు. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (17) కాసేపు క్రీజులో నిలిచినా.. జేమీసన్ బౌలింగ్‌లో వెనుదిరిగాడు. మరోవైపు కేఎల్ రాహుల్ (25) 80 బంతులు ఎదుర్కొని దాదాపు రెండు గంటల పాటు పోరాడాడు. చివరకు ఆఫ్‌స్టంప్ ఆవల పడిన బంతిని వెంటాడి క్యాచ్ ఇచ్చాడు.



ఆకాశ్ దీప్ పోరాటం వృథా

అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు నుంచి ఆట కొనసాగించిన న్యూజిలాండ్ తొలి ఇన్నింగ్స్‌లో 356 పరుగులకు ఆలౌటైంది. వికెట్ కీపర్ బ్యాటర్ టామ్ బ్లుండెల్ (89; 211 బంతుల్లో) అద్భుతంగా ఆడి జట్టు భారీ స్కోరుకు దోహదపడ్డాడు. అతడికి నేథన్ స్మిత్ (26), కైల్ జేమీసన్ (19), మాట్ హెన్రీ (19) సహకరించారు. భారత బౌలర్లలో ఆకాశ్ దీప్ అత్యుత్తమంగా రాణించి 99 పరుగులిచ్చి ఐదు వికెట్లు పడగొట్టాడు. జైస్వాల్ కూడా అద్భుతమైన క్యాచ్‌తో జేమీసన్‌ను పెవిలియన్‌కు పంపాడు.

డబ్ల్యూటీసీ ఫైనల్ ఆశలకు గండం

హాగ్లీ ఓవల్ పిచ్ ఇంకా పేసర్లకు సహకరిస్తుండటంతో భారత బ్యాటర్లకు సవాలు మరింత పెరిగింది. ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్‌కు చేరాలంటే ఈ మ్యాచ్‌లో భారత్ విజయం సాధించడం కీలకం. అయితే రెండో రోజు ఆట ముగిసే సమయానికి ఆరు వికెట్లు కోల్పోయి భారీ లోటులో ఉండటంతో టీమ్‌ఇండియా ఆశలు సంక్లిష్టంగా మారాయి.

డిసెంబరు 5న హాకీ ఇండియా ఎన్నికలు

- ఒడిశా హైకోర్టు స్టే ఉత్తర్వులను కొట్టివేసిన సుప్రీంకోర్టు
- హాకీ సంఘానికి జారీ చేసిన షోకాజ్ నోటీసులు రద్దు
- వివాదాల పరిష్కారానికి మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఏకే సిక్రీ నేతృత్వంలో కమిటీ

న్యూఢిల్లీ: హాకీ ఇండియా ఎన్నికల నిర్వహణకు సుప్రీంకోర్టు మార్గం సుగమం చేసింది. డిసెంబరు 5న షెడ్యూల్ ప్రకారమే ఎన్నికలు నిర్వహించుకోవచ్చని స్పష్టం చేసింది. ఎన్నికల ప్రక్రియపై స్టే విధిస్తూ ఒడిశా హైకోర్టు నవంబరు 6, 18 తేదీల్లో ఇచ్చిన రెండు ఉత్తర్వులను శనివారం కొట్టివేసింది. ఒడిశా హాకీ సంఘాన్ని శాశ్వత సభ్యత్వం నుంచి అసోసియేట్ సభ్యత్వానికి మార్చే ప్రతిపాదనతో హాకీ ఇండియా జారీ చేసిన రెండు షోకాజ్ నోటీసులను కూడా రద్దు చేసింది. ఆ సంఘం అభ్యంతరాలను మాజీ సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఏకే సిక్రీ నేతృత్వంలోని కమిటీ పరిష్కరిస్తుందని వెల్లడించింది. జస్టిస్ కేవీ విశ్వనాథన్, జస్టిస్ అరుణ్ పల్లి ధర్మాసనం విచారణ సందర్భంగా కీలక వ్యాఖ్యలు చేసింది. ''మైదానంలో కష్టపడి శిక్షణ పొందుతూ అద్భుతంగా రాణిస్తున్న క్రీడాకారుల భవిష్యత్తును ప్రమాదంలోకి నెట్టలేం. ఎన్నికల ప్రక్రియకు ఎలాంటి ఆటంకం కల గనివ్వం. ఎన్నికలు నిలిచిపోతే అంతర్జాతీయ హాకీ సమాఖ్యతో దేశ అనుబంధం, ఒలింపిక్స్‌లో భారత్ పాల్గొనే అవకాశాలపై ప్రభావం పడవచ్చు'' అని పేర్కొంది. హాకీ మన జాతీయ క్రీడ అని, అంతర్జాతీయ స్థాయిలో పేరొందిన క్రీడాకారులు ఇందులో ఉన్నారని గుర్తుచేసింది. ఎన్నికలు వాయిదా పడితే అంతర్జాతీయ సమాఖ్యతో హాకీ ఇండియా అనుబంధంపై ప్రభావం పడుతుందని ఆ సంస్థ తరపున వాదించిన సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. ఇరు వర్గాల మధ్య వివాదాలను పరిష్కరించేందుకు అవసరమైతే సమావేశం ఏర్పాటు చేస్తామని కేంద్రం తరపున అదనపు సొలిసిటర్ జనరల్ తెలిపారు.

సిక్రీ కమిటీకి ఫిర్యాదులు

ఒడిశా హాకీ సంఘానికి జారీ చేసిన షోకాజ్ నోటీసులను ఉపసంహరించుకోవాలని హాకీ ఇండియాకు ధర్మాసనం సూచించింది. తొలుత వాటిని కొంతకాలం నిలిపివేస్తామని హాకీ ఇండియా తరపు న్యాయవాది తెలిపారు. అయితే అక్టోబరు 7, 29 తేదీల్లో జారీ చేసిన రెండు నోటీసులను ధర్మాసనం పూర్తిగా రద్దు చేసింది. ఒడిశా క్రీడా సంఘం ఒడిశా, ఢిల్లీ హైకోర్టుల్లో దాఖలు చేసిన పిటిషన్లను కూడా పరిష్కరిస్తామని పేర్కొంది. ఇంకా ఏవైనా అభ్యంతరాలు మిగిలితే జస్టిస్ సిక్రీ నేతృత్వంలోని కమిటీ పరిశీలిస్తుందని స్పష్టం చేసింది. ఓటర్ల జాబితాపైనా ఒడిశా హాకీ సంఘం తరపున సీనియర్ న్యాయవాది కే పరమేశ్వర్ అభ్యంతరాలు వ్యక్తం చేశారు. కొన్ని రాష్ట్ర సంఘాల్లో భార్యాభర్తలు ఇద్దరూ సభ్యులుగా ఉన్నారని, దీనిపై పరిశీలన అవసరమని పేర్కొన్నారు.

అధ్యక్షుడు, కార్యదర్శి మధ్య విభేదాలు

హాకీ ఇండియాలో అధ్యక్షుడు దిలీప్ టిర్కీ, ప్రధాన కార్యదర్శి భోళానాథ్ సింగ్ మధ్య కొంతకాలంగా అధికార పోరు కొనసాగుతోంది. పరిపాలనా నిర్ణయాలు, పాలన, కార్యవర్గ సమావేశాల నిర్వహణపై ఇద్దరి మధ్య విభేదాలు తలెత్తాయి. ఆగస్టులో ఎఫ్ఐహెచ్ ప్రపంచకప్‌కు ముందు భారత జట్ల జెర్సీ రంగును సంప్రదాయ నీలం నుంచి కాషాయానికి మార్చడం వివాదానికి ఆజ్యం పోసింది. తనకు తెలియకుండా, కార్యవర్గం ఆమోదం లేకుండానే ఈ నిర్ణయం తీసుకున్నారని టిర్కీ ఆరోపించగా.. అధ్యక్షుడికి ముందే సమాచారం ఉందని, ఆమోద ప్రక్రియ కూడా జరిగిందని భోళానాథ్ సింగ్ పేర్కొన్నారు.

అక్టోబరు 6న జరిగిన హాకీ ఇండియా 120వ కార్యవర్గ సమావేశాన్ని అధ్యక్షుడి ముందస్తు అనుమతి లేకుండా నిర్వహించారని టిర్కీ అభ్యంతరం తెలిపారు. మరోవైపు, ఆ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు, అక్టోబరు 7న జారీ చేసిన షోకాజ్ నోటీసును ఒడిశా హాకీ సంఘం సవాలు చేసింది. సెప్టెంబరు 30తో ప్రస్తుత కార్యవర్గ పదవీకాలం ముగిసినందున ఆ నోటీసు చట్టబద్ధం కాదని వాదించింది.

ఢిల్లీ ట్రయల్స్‌లో గంగూలీ, యువీ

- ఐపీఎల్ మినీ వేలానికి ముందు ఆటగాళ్ల వేట
- 7 నుంచి కోల్‌కతాలో నాలుగు రోజుల శిబిరం
- ట్రయల్స్‌కు సిద్ధమైన కేకేఆర్
- 16న గోవాలో మినీ వేలం

కోల్‌కతా: భారత మాజీ కెప్టెన్లు సౌరవ్ గంగూలీ, యువరాజ్ సింగ్ తొలిసారి ఒకే జట్టుకు కోచింగ్ బృందంలో కలిసి పనిచేయనున్నారు. ఐపీఎల్ మినీ వేలానికి ముందు ప్రతిభావంతులైన ఆటగాళ్లను గుర్తించేందుకు ఢిల్లీ క్యాపిటల్స్ కోల్‌కతాలో నాలుగు రోజుల ట్రయల్స్ నిర్వహించనుంది. డిసెంబరు 7 నుంచి ప్రారంభం కానున్న ఈ శిబిరంలో జట్టు ప్రధాన కోచ్ గంగూలీతో పాటు కొత్తగా బ్యాటింగ్ కన్సల్టెంట్‌గా నియమితుడైన యువరాజ్ సింగ్ కూడా ఆటగాళ్ల ప్రదర్శనను పరిశీలించనున్నారు. ఈ ట్రయల్స్‌ను సాల్ట్‌లేక్‌లోని జాదవ్‌పూర్ యూనివర్సిటీ రెండో క్యాంపస్ మైదానంలో లేదా కరుణామయిలోని 22 యార్డ్స్ అకాడమీ మైదానంలో నిర్వహించే అవకాశం ఉంది. ఈ శిబిరం ద్వారా బెంగాల్‌కు చెందిన పలువురు క్రికెటర్లకు తమ ప్రతిభను నిరూపించుకునే అవకాశం లభించనుంది. సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో రాణించిన కరణ్ లాల్‌తో పాటు పేసర్లు నయన్ ఘోష్, కనిష్క్ సేథ్, బ్యాటర్ సుదీప్ కుమార్ ఘరామీల పేర్లు పరిశీలనలో ఉన్నట్లు సమాచారం. డిసెంబరు 16న గోవాలో జరగనున్న మినీ వేలానికి ముందే ఆటగాళ్ల సామర్థ్యాన్ని అంచనా వేయడం ఈ ట్రయల్స్ ప్రధాన ఉద్దేశం. మరోవైపు కోల్‌కతా నైట్ రైడర్స్ (కేకేఆర్) కూడా డిసెంబరు 4 నుంచి 7 వరకు ఈడెన్ గార్డెన్స్‌లో నాలుగు రోజుల ట్రయల్స్ నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలుస్తోంది.

డేవిస్ కప్ ఫైనల్లో స్పెయిన్

- బ్రిటన్‌పై 2–0తో ఘన విజయం
- ఆర్థర్ ఫెరీపై అల్కరాజ్ అలవోక గెలుపు
- నేడు ఇటలీతో టైటిల్ పోరు

బొలోగ్నా: స్పెయిన్ టెన్నిస్ జట్టు డేవిస్ కప్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. శనివారం జరిగిన సెమీఫైనల్లో బ్రిటన్‌పై 2–0తో విజయం సాధించింది. స్పెయిన్ స్టార్ కార్లోస్ అల్కరాజ్ వరుస సెట్లలో గెలిచి జట్టుకు ఫైనల్ బెర్తు ఖరారు చేశాడు. ఆదివారం జరిగే టైటిల్ పోరులో ఆతిథ్య ఇటలీతో స్పెయిన్ తలపడనుంది. ప్రపంచ మూడో ర్యాంకర్ అల్కరాజ్.. బ్రిటన్ ఆటగాడు ఆర్థర్ ఫెరీని 6–2, 6–1తో చిత్తు చేశాడు. కేవలం 72 నిమిషాల్లోనే మ్యాచ్‌ను ముగించాడు. ఈ ఏడాది వింబుల్డన్ సెమీఫైనల్ వరకు అనూహ్యంగా దూసుకొచ్చిన ఫెరీ.. అల్కరాజ్ ధాటికి నిలవలేకపోయాడు. అంతకుముందు జరిగిన తొలి సింగిల్స్‌లో రఫెల్ జోదర్ 6–2, 7–5తో కామెరాన్ నోరీని ఓడించాడు. దీంతో డబుల్స్ మ్యాచ్ అవసరం లేకుండానే స్పెయిన్ విజయం ఖాయమైంది. ఈ ఏడాది కెరీర్ గ్రాండ్ స్లామ్ పూర్తి చేసిన అల్కరాజ్.. మణికట్టు గాయం కారణంగా దాదాపు ఐదు నెలలు ఆటకు దూరమయ్యాడు. గత వారం ఏటీపీ ఫైనల్స్ టైటిల్ గెలిచి తిరిగి ఫామ్‌లోకి వచ్చాడు. ఫిట్‌నెస్ సమస్యల కారణంగా గురువారం ఆస్ట్రియాతో జరిగిన క్వార్టర్ ఫైనల్లో ఆడలేదు. అయితే శనివారం బరిలోకి దిగి జట్టు విజయానికి కీలకంగా నిలిచాడు. ఫైనల్‌కు చేరడం పట్ల అల్కరాజ్ ఆనందం వ్యక్తం చేశాడు. స్పెయిన్‌ను ఫైనల్‌కు చేర్చే పాయింట్ సాధించడం గర్వంగా ఉందన్నాడు.



Printed, published and owned by Adula Thirupathi, printed at Ramani web offset printers, H.NO 8-82/11/1,Auto Nagar, Bommakal Road, village, mdl & Dist : Karimnagar 505001,Telangana,
Published from, 8-1-141, Giddheperumandla Nagar Road, Karimnagar, Telangana, **Editor : Gaddam Ravi.** Email: vemulawadavaartha@gmail.com. RNI NO. TEL TEL /2017/71143